ప్రజాశక్తి

ఆదివారం 28 సెప్టెంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

నిర్వాసితులను పట్టించుకోండి

- మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌పై ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులు
- ఉద్యోగాలు, రూ.25 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్
- పర్యావరణ నివేదిక సహా అన్నీ తప్పుల తడక, భ్రమింపజేసే చర్యలు : సిపిఎం

మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి - నక్కపల్లి

ప్లాంట్ ఏర్పాటుతో నిర్వాసితుల మవుతున్న తమకు అన్నింటా న్యాయం చేయాలని ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో నిర్వాసితులు కోరారు. స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని, రూ.25 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్లాంట్ ఏర్పాటు కోసం తయారు చేసిన పర్యావరణ నివేదిక సహా పొందుపరిచిన వివరాలన్నీ తప్పుల తడకగా, నిర్వాసితులను భ్రమింపజేసేలా ఉన్నాయని సిపిఎం నేతలు ప్రజాభిప్రాయ సేకరణలో కుండబద్దలు కొట్టినట్టు చెప్పారు.

నక్కపల్లి మండలంలో బుచ్చిరాజుపేట, చందనాడ, డిఎల్.పురం, రాజయ్యపేట, వేంపాడు గ్రామాల్లో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్‌కు కేటాయించిన 2120 ఎకరాల విస్తీర్ణంలో ప్రతిపాదించ బడిన 8.2 ఎంటిపిఎ (సాలిన మిలియన్ టన్నులు) సామర్థ్యం కలిగిన గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ (ఐఎస్‌పి) ప్రాజెక్టు స్థాపన, అభివృద్ధి పనులకు ఎపి కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శనివారం చందనాడ గ్రామం (పాటిమీద) దగ్గర పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సును జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ నిర్వహించారు. ముందుగా ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవీంద్రనాథ్ ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ప్రజాభిప్రాయ సేకరణలో 40 మంది తమ అభిప్రాయాలను తెలియజేశారు.

సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ప్రజాభిప్రాయ సేకరణ కోసం తయారు చేసిన నివేదిక తప్పుల మిగతా 2లో..

మాట్లాడుతున్న లోకనాథం

పాల్గొన్న నిర్వాసితులు

నిరసన తెలుపుతున్న విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల నాయకులు

మిట్టల్ స్టీల్‌కు సేవ ఆపి..

విశాఖ ఉక్కును రక్షించండి

- పలుచోట్ల నిరసనలు

మోడీ, చంద్రబాబు, పవన్‌లు ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌కు సేవ చేయడం ఆపి, విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నేతలు డిమాండ్ చేశారు. శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రభుత్వాల తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్ సహా పలు కార్మిక, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన ఆందోళన చేపట్టారు. విశాఖ ఉక్కుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును నిరసించాచారు. (వార్తలు 4లో..)

ఎయు విద్యార్థులపై బెదిరింపులు తగవు

వార్త 2లో..

బిఎన్ రోడ్డు పనుల్లో నిర్లక్ష్యంపై కోర్టు సీరియస్

వార్త 8లో..

బస్సులు, రైళ్లు కిటకిట

వార్త 2లో..

పర్యాటక దినోత్సవ వేడుకల్లో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

పర్యాటకానికి చిరునామాగా విశాఖ

కలెక్టర్ హరేంధిర ప్రసాద్

వార్త 8లో..

అరకు కాఫీకి ప్రతిష్టాత్మక అవార్డు

- 'ఫైనాన్షియల్ ట్రాన్స్‌పర్మేషన్' విభాగంలో ఛేంజ్‌మేకర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం
- జిసిసి ప్రస్థానంలో మరో గొప్ప మైలురాయి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

జాతీయ స్థాయిలో గిరిజన సహకార సంస్థ (జిసిసి)కి ఘనమైన గుర్తింపు దక్కింది. ముంబయిలో శుక్రవారం నిర్వహించిన బిజినెస్ లైన్ చేంజ్‌మేకర్ అవార్డ్స్ - 2025 ఏడో ఎడిషన్‌లో కేంద్ర పెట్రోలియం, సహజవాయు శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి చేతులమీదుగా జిసిసికి చెందిన అరకు వ్యాలీ కాఫీకి 'ఫైనాన్షియల్ ట్రాన్స్ఫర్మేషన్' విభాగంలో ఛేంజ్‌మేకర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు - 2025 లభించింది. ఈ పురస్కారాన్ని గౌరవ అతిథి నుంచి జిసిసి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కల్పనా కుమారి స్వీకరించారు.

కల్పనా కుమారికి అవార్డు అందజేస్తున్న మంత్రి హర్దీప్ సింగ్ పూరి

జిసిసి విజయ ప్రస్థానమిలా..

1956లో స్థాపితమైన నాటి నుంచి గిరిజనుల ఆర్థిక, సామాజిక అభివృద్ధి పట్ల నిబద్ధతతో పనిచేస్తున్న జిసిసి 1970లలో అరకు వ్యాలీలో ప్రవేశపెట్టిన కాఫీ సాగు ద్వారా గిరిజనుల జీవనశైలిలో మార్పు తీసుకువచ్చింది. అది వారి జీవనోపాధిని పెంచడంతో పాటుగా వ్యవసాయాన్ని స్థిరమైన, ఆదాయకరమైన వృత్తిగా తీర్చిదిద్దడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కూడా పరిరక్షించింది. అరకు కాఫీ విజయగాథ పటిష్టమైన, సంఘటితమైన కృషికి ప్రత్యక్ష ఉదాహరణ.

ముఖ్యంగా గత దశాబ్ద కాలంగా పాడేరు, చింతపల్లి మండలాలలోని డివిజనల్ మేనేజర్లు, మేనేజర్లు, కాఫీ సేకరణ సిబ్బంది రైతులతో నేరుగా పనిచేస్తూ ప్రాథమిక స్థాయిలోనే నాణ్యతను నిర్ధారించారు. అదే విధంగా జిసిసి ప్రధాన కార్యాలయంలోని కాఫీ విభాగం సమన్వయం, మార్గదర్శనం, పర్యవేక్షణ ద్వారా ప్రతి దశలో అంతర్జాతీయ ప్రమాణాలకు మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

నిర్వాసితులను పట్టించుకోండి

తడకగా ఉందని అన్నారు. ఆంధ్రుల హక్కు.. విశాఖ ఉక్కుకు సొంత గనులు సాధించుకుండా ఏర్పాటుకాని మిట్టల్ స్టీల్‌ప్లాంట్ కోసం గనులు కేటాయించాలని కూటమి ప్రజా ప్రతినిధులు ఉక్కు శాఖ మంత్రిని కలవడం శోచనీయమన్నారు. రాష్ట్రాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సమాధి చేస్తూ ప్రైవేటు మిట్టల్ స్టీల్‌ప్లాంట్ నిర్మాణానికి పూనుకున్నారన్నారు. వైసిపి పాయకరావుపేట నియోజకవర్గ సమన్వయ కర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు మాట్లాడుతూ మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌లో స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. ఈ ప్రాంతం కాలుష్యం బారిన పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు మాట్లాడుతూ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. 2013 భూ సేకరణ చట్టాన్ని ఉల్లంఘించినట్లు తెలిపారు. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. నిర్వాసితుల ఆందోళనలు ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. నిర్వాసిత కుటుంబాల్లో 18 సంవత్సరాలు నిండిన వారందరికీ రూ.25 లక్షలు ఆర్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలన్నారు. కానీ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుని రూ.8 లక్షల 98 వేలు మాత్రమే చెల్లిస్తోందన్నారు. దీంతో ఇళ్ల నిర్మాణాలు సాధ్యమా అని ప్రశ్నించారు. మత్స్యకారుల భద్రత కోసం ఏ విధమైన చర్యలూ చేపట్టలేదన్నారు. నక్కపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలన్నారు. జెడ్‌పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్కును నిలుపుదల చేయాలన్నారు. వైసిపి నాయకులు వీసం రామకృష్ణ మాట్లాడుతూ మిట్టల్ ప్లాంట్ కోసం రెండో దశ భూసేకరణను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి చీఫ్ ఇంజినీర్ సుదర్శన్, ఆర్ అండ్ ఆర్ అధికారి వి.రమణ, తహశీల్దారు నరసింహమూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, నాయకులు గనిశెట్టి సత్యనారాయణ, శంకరరావు, ఎం.రాజేష్, సత్యనారాయణ, టిడిపి మండల శాఖ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, జనసేన నాయకులు తోట నగేష్, బిజెపి నాయకులు కోసూరి శ్రీను, వైసిపి మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, సిపిఐ నాయకులు ప్రభాకర్, రాజాన దొరబాబు పాల్గొన్నారు.

అరకు కాఫీకి ప్రతిష్టాత్మక అవార్డు

అనుగుణంగా కాఫీని తీర్చిదిద్దారు. ఈ సమిష్టి కృషి ఫలితంగా గిరిజన రైతులకు స్థిర ఆదాయం, గౌరవభరిత జీవితం, అంతర్జాతీయ గుర్తింపు లభించాయి. 2019లో జిఐ ట్యాగ్ పొందిన తరువాత అరకు కాఫీకి ప్రీమియం అంతర్జాతీయ మార్కెట్లను తెరిచారు. ఈ బ్రాండ్ సేంద్రీయ స్వచ్ఛత, మధుర సువాసన, ప్రత్యేక రుచితో విశిష్టతను సంపాదించుకుంది.

ఈ ఘన వారసత్వాన్ని కొనసాగిస్తూ 2024లో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతపల్లి, జికె.వీధి మండలాల్లో 2600 మంది రైతులకు చెందిన 6 వేల ఎకరాల కాఫీ, మిరియాల తోటలకు సేంద్రియ ధ్రువీకరణ లభించింది. ఇప్పుడు మరో నాలుగు మండలాల్లో 15 వేల ఎకరాల విస్తీర్ణానికి ధ్రువీకరణ విస్తరించే ప్రణాళికలు రూపొందించబడ్డాయి. ఇది కాఫీ, మిరియాలతోపాటు రాగి, రాజ్మా, పసుపు, అల్లం వంటి పంటలకూ వర్తిస్తుంది. దీని ద్వారా 10 వేల మంది రైతులు లబ్ధి పొందనున్నారు. అదేవిధంగా ఏడాది ఆగస్టు 9న పాడేరులో జరిగిన ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో సిఎం చంద్రబాబు సమక్షంలో జిసిసి, టాటా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. దీని ద్వారా దేశంలో తొలిసారిగా 'సేంద్రియ సాల్యూబుల్ కాఫీ ఉత్పత్తి ప్రారంభం కానుందని అధికారులు చెబుతున్నారు. అంతేకాకుండా, మౌలిక వసతుల బలోపేతం కోసం, నర్సీపట్నం సమీపంలోని మాకవరపాలెం మండలం, శెట్టిపాలెం గ్రామంలో ఆధునిక సాంకేతికతతో కూడిన ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 12 ఎకరాల భూమిని కేటాయించి, రూ.10 కోట్లు మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు విలువ ఆధారిత ఉత్పత్తుల అభివృద్ధి, మార్కెట్ వ్యాప్తిని పెంచనున్నట్లు చెబుతున్నారు.

అవార్డు స్వీకరించిన సందర్భంగా కల్పనా కుమారి మాట్లాడుతూ ఈ అవార్డు గిరిజన రైతులు, జిసిసి సిబ్బంది త్యాగం, అంకితభావానికి చిహ్నమని పేర్కొన్నారు. అరకు వ్యాలీ కాఫీ ఒక బ్రాండ్ మాత్రమే కాదని, అది గిరిజనుల గౌరవానికి, భారతదేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. గ్లోబల్ మార్కెట్లలో జిసిసి. అరకు వ్యాలీ కాఫీని విస్తరించడంలోను, రైతులకు మరింత గొప్ప పురోగతిని సులభతరం చేయడానికిగాను ఎవతో సహా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగిస్తామని చెప్పారు. పురస్కారాన్ని గిరి రైతులకు, జిసిసి ఉద్యోగులకు అంకితమచ్చారు.

హెచ్‌ఎస్ఎల్‌కు అవార్డులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: విశాఖపట్నం చాప్టర్‌లోని క్వాలిటీ సర్కిల్ ఫోరం ఆఫ్ ఇండియా (క్యుసిఎఫ్ఐ) శుక్రవారం నిర్వహించిన 25వ చాప్టర్ కన్వెన్షన్ ఆన్ క్వాలిటీ కాన్సెప్ట్ (సీసీక్యుసి -2025)లో హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్ఎస్ఎల్) ఐదు ప్రతిష్టాత్మక అవార్డులను గెలుచుకుంది. ఇందులో ప్రధానంగా డైవింగ్ సపోర్ట్ వెసెల్‌లోని అజిముత్ రిట్రాక్టబుల్ థ్రస్టర్స్ ఇన్‌స్టాలేషన్,కన్వెన్డ్ ఫోర్క్‌లిఫ్ట్‌ల పునరుద్ధరణలో వినూత్న పనికి హెచ్ ఎస్ ఎల్ రెండు బంగారు అవార్డులను, గ్యాస్ ప్లాంట్లలో లీకేజీలను తగ్గించే వ్యూహం, డిజిటల్ అసెట్ బుకింగ్ సిస్టమ్, డైవింగ్ సపోర్ట్ వెసెల్‌లోని మూన్‌పూల్ డోర్ హైడ్రాలిక్ హోస్ లోపాన్ని సరిదిద్దడంపై మూడు వెండి అవార్డులను గెలుచుకుంది. ఈ ఘనత సాధించిన బృందాలకు జిఎం (కమర్షియల్) డి.శ్రీనివాసరావు నాయకత్వం వహించారు.

అవార్డులతో హెచ్ఎస్ఎల్ అధికారులు

బస్సులు, రైళ్లు కిటకిట

◆ దసరా ఎఫెక్ట్ ◆ ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నాం : ఆర్‌టిసి ఆర్ఎం అప్పలనాయుడు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దసరా సందర్భంగా బస్సులు,రైళ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. గత రెండు రోజుల నుంచి ద్వారకా బస్ స్టేషన్‌తో పాటు, మద్దిలపాలెం, మధురవాడ ప్రాంతాల నుంచి వివిధ నగరాలకు వెళ్లే బస్సులు ప్రయాణికులతో రద్దీగా నడుస్తున్నాయి. కాంప్లెక్స్‌లో ఇటీవల ఎన్నడూ చూడనంత స్థాయిలో ప్రయాణికుల సందడి కనిపిస్తోంది. విద్యార్థులు తమ తల్లిదండ్రులతో కలిసి స్వగ్రామాలకు, వెళుతున్నారు. దసరా రద్దీ దష్ట్యా విజయనగరం జోన్ నుంచి వివిధ ప్రాంతాలకు 1500 ప్రత్యేక బస్సులు నడుపు తున్నట్లు ఆర్టిసి రీజినల్ మేనేజర్ అప్పలనాయుడు తెలిపారు. హైదరాబాద్‌కు10, శ్రీకాకుళం నుంచి 280, పార్వతీపురం నుంచి 140, విజయనగరం నుంచి 160, అల్లూరి జిల్లా నుంచి 25, అనకాపల్లి జిల్లా నుంచి 35, మొత్తం 650 బస్సులు విశాఖ నగరానికి ప్రత్యేకంగా నడుపుతున్నట్లు చెప్పారు. అలాగే జోన్ నుంచి విజయవాడకు 280, రాజమండ్రికి 200, ఇతర ప్రాంతాలకు మరో 370 బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. మహిళలకు ఉచిత ప్రయాణాలు లేని గరుడ వగైరా బస్సుల సంఖ్యను కూడా పెంచడం జరిగిందన్నారు. దసరా కోసం చార్జీలను పెంచలేదన్నారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రైవేటు బస్సుల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా చార్జీలను పెంచారు.

ద్వారకా బస్ స్టేషన్ వద్ద ప్రయాణికుల తాకిడి

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్: బాల్యవివాహాలు చట్ట విరుద్ధమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. శనివారం జిల్లాన్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని సంస్థ కార్యాలయంలో 'బాల్య వివాహాలు, శైశవ వివాహాలు, దాని దుష్ప్రభావాలు' అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ, బాల్య వివాహాలు చట్టవిరుద్ధమని, దీనివల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందన్నారు. ముఖ్యంగా, చిన్నవయసులో గర్భధారణ వల్ల తల్లీబిడ్డల ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం పడుతుందన్నారు. అవసరమైన వారికి ఉచిత న్యాయ సహాయం అందించడానికి డిఎల్ఎస్ఎ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం సమావేశానికి హాజరైన ప్రతి ఒక్కరితో బాల్య వివాహాలను నివారించడానికి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పిడి కె.రమాలక్ష్మి, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి గణపతి, వాసవ్య మహిళా మండలి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎయు విద్యార్థులపై బెదిరింపులు తగవు

సమస్యలను మంత్రి లోకేష్ పరిష్కరించాలి
సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఆంధ్రా యూనివర్సిటీ విద్యార్థులపై రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బెదిరింపులు ఆపి ఎయులో సమస్యల పరిష్కారానికి పూనుకోవాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం జగ్గు నాయుడు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆంధ్ర యూనివర్సిటీలో బిఈడీ కోర్సు చదువుతున్న మణికంఠకు సకాలంలో సరైన వైద్యం అందకపోవడంతో గురువారం మృతి చెందాడన్నారు. మృతుడు 2024 ఎడ్‌సెట్ స్టేట్ మొదటి ర్యాంకు సాధించాడన్నారు. ఎయు విసి, ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతోనే మణికంఠ ప్రాణాలు కోల్పోయాడని ఎయులో విద్యార్థులు ఆందోళన చేశారన్నారు. బాధ్యత గల మంత్రిగా నారా లోకేష్ వాస్తవ సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించి విద్యార్థుల ప్రాణాలకు రక్షణ కల్పించాలన్నారు. ఈ విషయంలో కొందరు విశ్వవిద్యాలయంలో గొడవలు సృష్టిస్తున్నారని, తీరు మారకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి బెదిరించడం తగదన్నారు. మంత్రి ప్రకటన బాధ్యతారాహిత్యంగానూ, బెదిరింపులతో ఉందన్నారు. ఎయులో సరైన వైద్యం, ఆక్సిజన్ అందక రాష్ట్ర మొదటి ర్యాంకర్ మణికంఠ మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. దీనిని చిన్నపాటి సమస్యగా మంత్రి లోకేష్ చూడడం భావ్యం కాదన్నారు. ఇది రాష్ట్ర విద్యాశాఖ, ప్రభుత్వం, ఎయు ఉన్నతాధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. మణికంఠ మృతిపై బాధ్యత వహించాలని జగ్గు నాయుడు డిమాండ్ చేశారు. ఎయులో పోలీస్ నిర్బంధం, ప్రజాతంత్ర హక్కులను హరించిన వైసిపి ప్రభుత్వానికి ఏ గతి పట్టిందో విద్య ఐటి శాఖ మంత్రి గమనించాలని సూచించారు. ఎయు డిస్పెన్సరీని మినీ హాస్పిటల్‌గా మార్చాలని డిమాండ్ చేశారు. 24 గంటలూ డాక్టర్లను అందుబాటులో ఉంచాలన్నారు. ఆక్సిజన్ సిలిండర్లు, ఎక్సరే, స్కానర్లు, మోడల్ అంబులెన్స్, మోడరన్ ల్యాబ్, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అంబులెన్స్‌లో నర్సు, టెక్నీషియన్ ఉండాలన్నారు. మహిళా హాస్టల్లో 24 గంటలు స్టాఫ్ నర్స్, అంబులెన్స్, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. యూనివర్సిటీలో ప్రతినెల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. హాస్టళ్లలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు, శానిటరీ నాప్కిన్ ప్యాడ్స్ ఉంచాలన్నారు.

లింగేశ్వరరావుకు కమిషనర్ అభినందన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఇటీవల తైవాన్‌లో ముగిసిన ప్రపంచ సీనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో విశాఖ నగరానికి చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి బివిఎస్‌కె లింగేశ్వరరావు రజిత పతకాన్ని సాధించారు. ప్రపంచవ్యాప్తంగా 54 దేశాల నుండి సుమారు 1700 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. మన దేశానికి చెందిన 198 మంది పాల్గొన్నారు. ఈ పోటీల్లో విశాఖపట్నంనకు చెందిన లింగేశ్వరరావు మిక్స్‌డ్ డబుల్ విభాగంలో పతకాన్ని సాధించారు. ఈ సందర్భంగా ఆయనను శనివారం జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జివిఎంసి కమిషనర్ కేతన్‌గార్గ్ , 43వ వార్డు కార్పొరేటర్ , జనసేన నాయకురాలు, ఈవెంట్స్ ఎస్‌బి ఎవి డి కార్యదర్శి ఉషశ్రీ అభినందించారు.

లింగేశ్వరరావుతో కేతన్‌గార్గ్, ఉషశ్రీ

సబ్జీ కూలర్ల పనితీరు పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: నగరంలోని ఎంవిపి కాలని రైతుబజార్లో ఉన్న సబ్జీ కూలర్ల పనితీరును శనివారం ఉద్యానవన శాఖాధికారి భాను పరిశీలించారు. వాటిని వినియోగిస్తున్న రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రైతులందరినీ సమావేశపరిచి అక్టోబర్ 10వ తేదీ లోపల రైతులందరూ ఈ క్రాప్ నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు. ఉద్యానవన శాఖ వారు కల్పిస్తున్న రాయితీలు మల్చింగ్, డ్రిప్, విత్తనాలు, పంటలకు వచ్చే చీడపీడలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అవసరమైన వారు సంబంధిత మండల ఉద్యానవన శాఖ అధికారిని లేదా తమ గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ అధికారి కె.వరహాలు, సహాయకుడు కనకరాజు, శ్రీలక్ష్మి, భవాని తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కాకినాడ 6వ అదనపు జిల్లా జడ్జిగారి కోర్టు
O.S. No. 32/2017
Between :
అబ్బిరెడ్డి రామ్‌ప్రకాష్ ...ప్లెయింటిఫ్
మరియు
1) పల్లా వరలక్ష్మి (died)
2) పల్లా సత్యారావు (died), వగైరాలు
...డిఫెండెంట్లు
D_3 - పల్లా సత్యసంతోష్ కుమార్, S/o. లేటు సత్యారావు, C/o. సురేష్ రెడ్డి అవ్వరెడ్డి, హెచ్.నెం.2-6-1049/1, రోడ్ నెం.2, స్ట్రీట్ నెం.6, డిపాజిట్ హైస్కూల్ ప్రక్కన, కె.ఎల్.ఎన్.రెడ్డి కాలనీ, వరంగల్, తెలంగాణ స్టేట్.
D_4 - ధూళిపాటి యశోద, W/o. కుమార్, ఫ్లాట్ నెం.501, డోర్.నెం.4-59-17/12, శ్రీ సాయి సంపత్ అపార్ట్‌మెంట్స్, లాసన్స్‌బే కోలనీ, విశాఖపట్నం.
D_5 - పల్లా సరితారమణి, W/o. (లేటు) విజయ్, ఉద్యోగస్తురాలు, డోర్.నెం.3-42/3, పంచాయితీ ఆఫీసు ప్రక్కన, జగ్గిపేట, నీలపల్లి గ్రామం, తాళ్లరేవు మండలం, కాకినాడ జిల్లా.
పై దావాలో మీరు D3, D4 మరియు D5 అయ్యున్నారు. పైన తెలిపిన దావాలో శ్రీ కోర్టు వారి ద్వారా మీకు ఎన్నిసార్లు సమన్లు పంపినను తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. పైన తెలిపిన దావా **ది. 14-10-2025 సం॥** తేదీన వాయిదా అయ్యున్నది. కావున పై తేదీన, పైన తెలిపిన కోర్టులో హాజరై మీ అక్షేపణలు తెలియపరచుకోవలెను. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానము చేయబడునాయి ఇందుమూలముగా తెలియజేయడమైనది.
|| By Court Order ||
కాకర వెంకటేశ్వరరావు, అడ్వకేట్
#12-1-40, జవహర్ వీధి, కాకినాడ.
Ph: 0884-2367503, Cell: 9848314081

మండల సమావేశంలో సమస్యలపై చర్చ

ప్రజాశక్తి- పద్మనాభం : పద్మనాభం మండల సమావేశంలో సమస్యలపై చర్చ నడిచింది. సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానాలిచ్చారు. మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపిపి రాంబాబు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఎఇ నరేష్ మాట్లాడుతూ, మంచినీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, కొన్ని గ్రామాల్లో ఇంటింటికి కుళాయిలు వేస్తున్నామని తెలిపారు. ఆ సమయంలో శేరీకాండం సర్పంచ్ పి.చిన్నారావు స్పందిస్తూ కుళాయిల పనుల నిమిత్తం సీసీ రోడ్లు తవ్వేశారని, వాటిని పునర్నిర్మించాలని కోరారు. దీనికి ఎఇ స్పందిస్తూ ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. రేవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి లీలా ప్రసాద్ మాట్లాడుతూ, ఇటీవల కాలంలో కుక్కలు, పాములు, ఎలుకలు కరిచిన కేసులు ఎక్కువయ్యాయని, విష జంతువులు కరిస్తే తప్పనిసరిగా ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి ఇంజక్షన్ చేయించుకోవాలని కోరారు. ఆర్వి.పురం ఎంపిటిసి సభ్యులు ఎస్.సూరప్పుడం మాట్లాడుతూ గతంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు జరిగేవని, ప్రస్తుతం చేయటం లేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. సిబ్బంది కొరత వల్ల రక్త పరీక్షలు, ఇతర ఆరోగ్య కార్యక్రమాలు సక్రమంగా జరగకపోవడంతో రోగులు ఆర్ఎంపి డాక్టర్లను ఆశ్రయిస్తున్నారని, దీనిని నివారించాలని కోరారు. దీనికి స్పందించిన డాక్టర్ లీలా ప్రసాద్ సిబ్బంది కొరత ఉన్నప్పటికీ సాయి శక్తులా పనిచేస్తున్నామని చెప్పారు. కుటుంబ నియంత్రణ ఆపరేషన్లపై గతంలో టార్గెట్లు ఇచ్చి పరిశీలించే వారిని, ఇప్పుడు నియంత్రణపై

మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి రాంబాబు

ప్రభుత్వానికి ఎటువంటి ఆలోచన లేదని పేర్కొన్నారు. మండల వ్యవసాయ శాఖాధికారి ఎం.వెంకటాచలం మాట్లాడుతూ, సకాలంలో వర్షాలు పడటంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో 6700 ఎకరాల్లో వరి నాట్లు వేశారని తెలిపారు. ఈ పంట నమోదు ఈ నెల 30వ తేదీలోపు చేసుకోవాలని చెప్పారు. అక్టోబర్ నెలలో ఇనాం భూములకు, రైతులకు రైతు భరోసా ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఆ సమయంలో శేరీకాండం సర్పంచ్ చెన్నారావు మాట్లాడుతూ, పిఎం.కిసాన్ రైతులదరికీ రావడంలేదని సభ దృష్టికి తీసుకొచ్చారు. దీనికి వ్యవసాయాధికారి స్పందిస్తూ 2019 ముందు పిఎం కిసాన్‌లో రిజిస్టర్ అయిన రైతులకు మాత్రమే అందుతుందని తెలిపారు. పశువైద్యాధికారి మాట్లాడుతూ, మండలంలోని ఉపాధి హామీ పథకం కింద 35 పశువులు పాకలు మంజూరయ్యాయని తెలిపారు. దీనిపై పలువురు సభ్యులు స్పందిస్తూ 2014 నుండి 2019 మధ్యలో రైతుల నుండి పశువులు పాకల నిర్మాణానికి అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం రూ.18 వేలు చొప్పున డీడీలు తీసుకుందని, అవి నేటికీ కార్యరూపం దాల్చలేదని సభలో లేవనెత్తారు. ఎపిఎం రమణ మాట్లాడుతూ, మహిళల జీవనోపాధి మెరుగుపరచాలని స్త్రీ నిధి కింద 1200 మందికి రూ.675 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ, మండలంలోని నాలుగు అంగన్వాడీ కార్యకర్తలు, నాలుగు హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ సమయంలో ఎంపిపి రాంబాబు మాట్లాడుతూ, కొన్ని పంచాయతీల్లో అంగన్‌వాడీ కేంద్రాలు పరాయిపంచన నడుస్తున్నాయని, కొన్ని గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలో ఖాళీగా ఉన్నాయని, వాటిలో వినియోగించుకోవడానికి అనుమతి ఇవ్వాలని ఎంఇఒ పి.రమణను కోరారు. దీనిపై ఎంఇఒ రమణ స్పందిస్తూ ఇందుకు ప్రతిపాదనలు తయారుచేశామని, ఐసిడిఎస్ నుండి దరఖాస్తు చేయాలని సూపర్‌వైజర్లకు సూచించానని వివరించారు. ఈ ఏడాది డిఎస్‌సి ఫలితాల్లో మండలంలో 40 మంది ఉపాధ్యాయులుగా అర్హత సాధించారని తెలిపారు. మండలంలో నాలుగు పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని, 36 మంది వేర్వేరు మండలాల్లో పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని ఎంఇఒ రమణ తెలిపారు. ఈ సమయంలో ఎంపిపి రాంబాబు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల బస్సులతో ఏటా ఎక్కడో ఒకచోట ప్రమాదం జరుగుతూనే ఉందని, ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి బస్సులపై చర్చించాలని చెప్పారు. మండల ఇంజినీరింగ్ అధికారి వెంకటేశ్వర మాట్లాడుతూ, 2025-26 సంవత్సరంలో కొత్తగా పనులకు నిధులు మంజూరు కాలేదన్నారు. ఇన్‌ఛార్జి ఇఒఆర్‌డి రమేష్ నాయుడు మాట్లాడుతూ, మండలంలోని అన్ని పంచాయతీల్లో పారిశుధ్యం సరిగా లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ వి.నగేష్, వైస్ ఎంపిపి రాజేశ్వరి, భీమిలి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.రామస్వామినాయుడు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న బోర్డు ఆఫ్ విజిటర్స్ సభ్యులు

కేంద్రకారాగారంలో బోర్డు ఆఫ్ విజిటర్స్ సమావేశం

ప్రజాశక్తి - ఆరిలోవ : బోర్డు ఆఫ్ విజిటర్స్ సమావేశాన్ని విశాఖ కేంద్రకారాగారంలో శనివారం నిర్వహించారు. బోర్డు ఆఫ్ విజిటర్స్ చైర్మన్, జిల్లా న్యాయమూర్తి చెన్నంశెట్టి రాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి సభ్యులుగా ఉన్న జిల్లా కలెక్టర్, పోలీసు డిప్యూటీ కమిషనర్, జిల్లా వైద్యాధికారి, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి, జిల్లా వ్యవసాయాధికారి, ఉపాధికల్పనాధికారి, పారిశ్రామికాధికారి హాజరయ్యారు. కారాగారంలో ఖైదీల సంక్షేమం తదితర విషయాలపై చర్చించారు. అనంతరం వారు కేంద్రకారాగారంలో గల సర్ణముఖి, ప్రాణహిత (హాస్పిటల్), జనరల్ కిచెన్‌ను సందర్శించారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రకారాగారంలో పర్యవేక్షణాధికారి ఎం.మహేష్‌బాబు, ఉప పర్యవేక్షణాధికారులు ప్రవీణ్ కుమార్, సూర్య ప్రకాష్, జైలర్లు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన పథకాలపై అవగాహన

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండల పరిషత్ సమవేశమందిరంలో శనివారం గ్రామీణాభివృద్ధి, పేదరిక నివారణ, ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు పేదరిక నివారణ, ప్రభుత్వ పథకాల సద్వినియోగం, అవసరమైతే సహాయసహకారం పొందే విధానాలపై డిప్యూటీ ఎంపిడిఒ బి.సత్యనారాయణ మార్గదర్శకత్వం అందించారు. ప్రతి గ్రామానికీ సంబంధించిన సమస్యలను పి-4 సదస్సు ద్వారా గుర్తించి, స్థానిక అధికారులకు అందించడం ద్వారా పేదరిక నిర్మూలన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ నెంబర్లు ఉషా పద్మిని, దివ్యజ్యోతి, నవ్య, ఉషారాణి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఎంపిల సేవలపై చర్చతో హర్షం

ప్రజాశక్తి- ఆనందపురం : ఆర్ఎంపిల సేవలను విజయవాడ దక్షిణ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు లేవనెత్తడంపై స్థానిక ఆర్ఎంపిలు హర్షం వ్యక్తం చేశారు. సమాజానికి వారి సేవల అవసరాన్ని స్పీకర్‌కు వివరించి, ఉపయోగించుకోవాలని ముఖ్యమంత్రి, వైద్య శాఖ మంత్రులకు సిఫారసు చేయడంపై ఆనందం వ్యక్తంచేశారు.

కేర్‌లో రోబోటిక్‌తో కార్డియాక్ బైపాస్ సర్జరీ

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆంధ్రప్రదేశ్‌లోనే మొదటిసారిగా రోబోటిక్ సహాయంతో కరోనరీ ఆర్టరీ బైపాస్ సర్జరీని విజయవంతంగా నిర్వహించి విశాఖపట్నం కేర్ ఆసుపత్రి ఒక చారిత్రాత్మకమైన మైలురాయిని నమోదు చేసుకుందని కేర్ ఆసుపత్రి గ్రూప్ చీఫ్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ నిఖిల్ మాథూరఖ్ తెలిపారు. ఇంతవరకు ఈ అత్యాధునిక రోబోటిక్ బైపాస్ సాంకేతికత ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండేదని, ఇప్పుడు విశాఖలో కూడా పొందగలరని పేర్కొన్నారు. 54 ఏళ్ల రోగికి సాధారణ పరీక్షలో ట్రిపుల్ వెసెల్ కరోనరీ ఆర్టరీ వ్యాధి ఉన్నట్టు గుర్తించామని, మూడు ప్రధాన కరోనరీ ధమనుల్లో తీవ్రమైన బ్లాకేజీలు కనిపించడంతో కేర్ కార్డియాక్ టీమ్ రోబోటిక్ సహాయంతో మినిమల్లీ ఇన్వాసివ్ కరోనరీ సర్జరీ చేయాలని సూచించారని తెలిపారు. ఆధునిక వైద్య సాంకేతికతతో ఈ శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తి చేసినట్లు వివరించారు.

అవంతిలో దసరా సంబరాలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం దసరా సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి షరీఫ్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శిల్పారామంలో నేటి నుంచి దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-మధురవాడ : శిల్పారామం జాతరలో ఆదివారం నుంచి దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు జాతర పరిపాలన అధికారి రమేష్ రెడ్డి తెలిపారు. ఆదివారం నుంచి ప్రతి రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల మధ్య కూచిపూడి నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి- పద్మనాభం : మండలంలో వివిధ హోదాల్లో పనిచేసి బదిలీ అయిన ఉద్యోగులకు మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సన్మానించారు. ఎంపిడిఒ ఎం.విజయ్‌కుమార్ డిడిఒగా ప్రమోషన్‌పై బదిలీ అయ్యారు. పంచాయతీ విస్తరణాధికారిగా పనిచేస్తున్న మీనా కుమారి ఎంపిడిఒగా ప్రమోషన్‌తో బదిలీ అయ్యారు. వీరిని ఎంపిపి రాంబాబు ఆధ్వర్యాన ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు సన్మానించారు. వారి సేవలను కొనియాడారు.

పద్మనాభం ఎంపిడిఒగా రూపేష్

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కుంచాడ రూపేష్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన పార్వతీపురం ఎంపిడిఒగా పనిచేస్తూ బదిలీపై పద్మనాభం వచ్చారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జెడ్పీ హైస్కూల్లో ఎన్ఎంఎంఎస్‌లో ఉచితంగా శిక్షణ పొందుతున్న విద్యార్థులకు పలు పాఠ్యాంశాలపై శనివారం అవగాహన కల్పించారు. ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు డి.దాలయ్య బాబు అనేక అంశాలపై శిక్షణ ఇచ్చారు. పరీక్షలకు వెళ్లేటప్పుడు భయం వీడాలని, ఏకాగ్రత అవసరమని నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, సలహాదారులు జివి.అప్పారావు, బయాలజీ అధ్యాపకులు వైవి.రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో గుండెకు భరోసా

రూ.45 వేల ఇంజక్షన్ ఉచితం

డాక్టర్ ఎం ఫణి కుమార్

ప్రజాశక్తి -భీమునిపట్నం : గుండె పోటు బాధితులకు భరోసాగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో స్టెమి ప్రాజెక్ట్ పేరుతో వైద్యులు నిర్ధారణ పరీక్షలు చేశాక అవసరమని భావిస్తే రూ.45 వేలు విలువగల “టెనెక్టె ప్లస్” ఇంజక్షన్‌ను ఉచితంగా ఇవ్వనున్నారు. దాదాపు రెండున్నరేళ్లుగా ఇక్కడి ఆసుపత్రిలో ఈ సదుపాయం ఉంది. రెండున్నరేళ్ల కాలంలో నలుగురు గుండె పోటు బాధితులకు ఈ ఇంజక్షన్ ఇవ్వడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.ఫణికుమార్ శనివారం ప్రజాశక్తికి తెలిపారు. జిల్లాలోని అన్ని ఏరియా ప్రభుత్వాసుపత్రుల్లోనూ ఈ సదుపాయం అందుబాటులో ఉన్నట్లు ఆయన తెలిపారు. గుండె పోటు వచ్చిన మొదటి గంట అత్యంత కీలకమని చెప్పారు.

గుండె పోటు లక్షణాలు ఇవీ..

గుండె నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండె దడ, స్పృహ కోల్పోవడం లాంటివి వచ్చిన వెంటనే సమీపంలో ఉన్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లాలని కోరారు. ఇసిజి, బిపి, సుగర్ ఇతరత్రా అవసరమైన పరీక్షలు చేసి రిపోర్టులను కెజిహెచ్‌కు వెంటనే పంపిస్తామని చెప్పారు. కార్డియాలజిస్ట్ నుంచి సమాచారం వచ్చిన వెంటనే గుండె సంబంధిత బాధితునికి 108లో కెజిహెచ్‌కు తీసుకెళ్లి మరికొన్ని పరీక్షలు చేసి, మరలా ఇక్కడకు తీసుకొచ్చి కార్డియాలజిస్ట్ సూచనల మేరకు రూ.45 వేలు విలువగల 'టెనెక్టె ప్లస్' ఇంజక్షన్ వేస్తామని వివరించారు.

వ్రిందా ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి - ఆరిలోవ : ఆరిలోవ హెల్త్‌సిటీలోని వ్రిందా సూపర్ స్పెషాలిటీ అండ్ కేన్సర్ రీసెర్చ్ సెంటర్‌లో సుడోమ్యాక్సిమా పెరిటోని వ్యాధితో బాధపడుతున్న ఓ వ్యక్తికి అరుదైన, సంక్లిష్టమైన శస్త్రచికిత్సను సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ వంశీధర్ పుట్రేటి విజయవంతంగా పూర్తిచేసినట్లు వైద్యుల బృందం ప్రకటించింది. వ్రిందా ఆసుపత్రిలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ వంశీధర్ పుట్రేటి వైద్య బృందం వివరాలను వెల్లడించింది. శ్రీకాకుళం జిల్లా రాజాం పట్టణానికి చెందిన రోగి పొట్టలో జిగురు లాంటి ద్రవం చేరిందని డాక్టర్ వంశీధర్ పుట్రేటిని కలిశారు. పరిశీలించిన డాక్టర్ వంశీ పలు పరీక్షలు నిర్వహించిన అనంతరం అపెండిక్స్‌లో ట్యూమర్‌ను గమనించి అది సుడోమ్యాక్సిమా పెరిటోని అనే వ్యాధిగా గుర్తించారు. కోటి మందిలో ఒక్కరికి మాత్రమే ఇటువంటి వ్యాధి వస్తుందని వైద్యులు తెలిపారు. డాక్టర్ వంశీ వైద్య బృందం సుమారు 10

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వ్రిందా వైద్య బృందం

గంటలు కష్టపడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం కోలుకున్న రోగి మాట్లాడుతూ, ఇక్కడి వైద్య బృందం తనకు కొత్త జీవితాన్ని ఇచ్చారని, వారి మేలు మరువలేనిదని హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ అప్పలనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీలో రెండో విడత అడ్మిషన్లు

ప్రజాశక్తి- తగరపువలస : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండో విడత అడ్మిషన్లు జరుగుతున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీవాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులు తగరపువలస, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెబ్ ఆప్షన్‌లో చూడాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేయించుకోలేని వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో తమ కళాశాలకు వస్తే ఈ నెల 29వ తేదీ వరకు ఉచితంగానే రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని విద్యార్థులకు సూచించారు.

పాదయాత్ర చేస్తున్న సిపిఎం నాయకులు

అదాని సిమెంట్ ఫ్యాక్టరీ రద్దు చేయాలని సిపిఎం పాదయాత్ర

ప్రజాశక్తి -గాజువాక : పెదగంట్యాడలో అదాని సిమెంట్ పరిశ్రమను పెట్టొద్దు అని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన శనివారం గాజువాకలో పాదయాత్ర చేపట్టారు. రత్నవారి వంటిల్లు నుండి కొత్త గాజువాక వరకు పాదయాత్ర సాగింది. ఈ పాదయాత్రనుద్దేశించి సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, సిమెంట్ ఫ్యాక్టరీ వల్ల శబ్ద కాలుష్యం, భూగర్భ జలాలు, వాయు కాలుష్యం పెరుగుతుందన్నారు. వీటి వల్ల కేన్సర్, ఊపిరితిత్తులు, గర్భ దారణ సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. ఒడిశాలో ప్రజలు వ్యతిరేకిస్తే దాన్ని పెదగంట్యాడ మండలంలో పెట్టుకోడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతులివ్వడం దుర్మార్గం అన్నారు. స్థానిక ఎమ్మెల్యే దీనిని వ్యతిరేకించకుండా మద్దతు ఇవ్వడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై అక్టోబర్ 8వ తేదీన జరిగే పబ్లిక్ హియరింగ్‌లో వేలాదిమంది ప్రజలు పాల్గొని వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.లోకేష్, గొలగాని అప్పారావు, జి.రాము, ఎం.శ్రీదేవి, డి.రమణ, దాసు, నాయుడు, రాజబాబు పాల్గొన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న సిపి శంఖబ్రత బాగ్చి

అవినీతి రహిత సమాజం కోసం పాటుపడాలి : సిపి

ప్రజాశక్తి -ములగాడ : అవినీతి రహిత సమాజం కోసం అందరూ పాటుపడాలని విశాఖ పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని సెయింట్ ఆన్స్ ఉమెన్స్ కాలేజీలో విజిలెన్స్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ, విద్యార్థినులు, ఉద్యోగులు అవినీతి రహిత సమాజం కోసం పాటుపడాలని, దానికి సంబంధించి ప్రతి ఒక్కరూ తనకు తానుగా నిజాయతీతో మెలుగుతూ తమ చుట్టూ ఉన్న అవినీతి అధికారుల గురించి సంబంధిత శాఖలకు సమాచారం ఇచ్చి దేశాభివృద్ధికి పాటుపడాలని కోరారు.

అప్పన్న నిత్యాన్నప్రసాదానికి విరాళం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం శ్రీ వరాహలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం నిత్యాన్నప్రసాదం పథకానికి విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన బి.వెంకటసుబ్బారావు, ధనలక్ష్మి రూ.1,00,011 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని పిఆర్‌ఒ కార్యాలయంలోని విరాళ కౌంటర్ వద్ద చెల్లించారు. అనంతరం దాతకు నిత్యాన్నప్రసాద బాండ్‌ను ప్రోటోకాల్ పర్యవేక్షణాధికారి పి.సునీల్‌కుమార్, పిఆర్‌ఒ నాయుడు అందజేశారు. దాత, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. దాతకు ఆలయ పర్యవేక్షణాధికారి బి.సత్యశ్రీనివాసు స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి, ప్రసాదాలను అందజేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి 95వ వార్డు పరిధి చీమలాపల్లి ఎంఐఎస్ లే-అవుట్‌లో సుమారుగా రూ.39.30 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు పనులను వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలు పాటించి పనులు వేగవంతం చెయ్యాలని కాంట్రాక్టరుకు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్‌ఇన్‌స్పెక్టర్ భద్ర, కూటమని నాయకులు అయిత ఎర్నిబాబు, సబ్బవరపు ప్రకాష్, కంచిబోయిన వెంకట సంతోష్, పిడివి.ప్రసాద్, బి.వెంకటరావు, అయిత శివ, సత్యనారాయణ, అప్పలనాయుడు పాల్గొన్నారు.

మిట్టల్ స్టీల్‌కు సేవ ఆపి..

విశాఖ ఉక్కును రక్షించండి

- పలుచోట్ల నిరసనలు

ప్రజాశక్తి - యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్ : మోడీ, చంద్రబాబు, పవన్‌లు ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌కు సేవ చేయడం ఆపి, విశాఖ ఉక్కు కర్మాగారానికి సొంత గనులు కేటాయించాలని విశాఖ జిల్లా అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి నేతలు డిమాండ్ చేశారు. శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ప్రభుత్వాల తీరుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జెఎసి చైర్మన్ ఎం.జగ్గునాయుడు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ మంత్రి రాజశేఖర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు, ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నాగభూషణం, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధినేతలు అనకాపల్లి జిల్లాలో ప్రతిపాదిత ఆర్సెలార్ మిట్టల్ ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్‌పై చూపిస్తున్న తపన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై చూపకపోవడం ప్రజలను వంచించడమే అవుతుందన్నారు. దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగ స్టీల్‌ప్లాంట్లకు కేంద్రం సొంత గనులు కేటాయించి విశాఖ ఉక్కు పట్ల వివక్ష చూపడం దారుణమన్నారు. తుదకు అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఇంకా ఏర్పాటేకాని మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు అన్నింటినీ సమకూరుస్తున్నారన్నారు. ఆ ప్రైవేటు ప్లాంట్‌కు గనులు కేటాయించాలని విశాఖ ఎంపీ శ్రీభరత్ సహా టిడిపి ఎంపీలంతా కేంద్ర ఉక్కు మంత్రిని కలిసిన విషయాన్ని గుర్తుచేశారు. విశాఖ ఉక్కుకు సొంత గనులు విషయంపై మాత్రం వారెవరూ నోరు విప్పకపోవడం ప్రజలకు ద్రోహం చేయడమే అవుతుందన్నారు. సొంత గనులు లేక విశాఖ ఉక్కు కర్మాగారం ప్రతి టన్ను ఉక్కు ఉత్పత్తికి రూ.4 వేలు అదనపు ఉత్పత్తి ఖర్చును భరించాల్సి వస్తోందన్నారు. దీని వల్ల సంస్థ నష్టాల బారిన పడుతోందన్నారు. దాన్ని కార్మికులపై నెడుతున్నారన్నారు. కార్మికులు అధికంగా ఉన్నారంటూ నైపుణ్యాలైన ఐదు వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను చట్టవిరుద్ధంగా, అమానుషంగా తొలగించారన్నారు. వారి స్థానంలో అనుభవం లేని, ఇతర రాష్ట్రాల కార్మికులను విధుల్లోకి తీసుకొని పనిచేయిస్తున్నారని తెలిపారు. కార్మికులు అధికమైతే ఇతర రాష్ట్రాల వారిని ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. కొత్తవారిని తీసుకోవటాన్ని విశాఖ ఎంపీ, గాజువాక ఎమ్మెల్యే ఆపడం లేదన్నారు. ప్యాకేజీ ఇచ్చామని, ఉక్కు ప్రైవేటీకరణ జరగదని మాటలు చెబుతూ కూటమి పాలకులు ప్రజలను మోసపుచ్చుతున్నారన్నారు. ఇఒఐల పేరిట ప్లాంట్‌లోని కీలక డిపార్టుమెంట్లు అన్నింటినీ ప్రైవేటుకు కట్టబెట్టి, ఆ తరువాత ప్లాంట్ మొత్తాన్ని అదాని, మిట్టల్ వంటి కార్పొరేట్లకు కట్టబెట్టాలన్నది మోడీ ప్రభుత్వ కుట్రగా ఉందన్నారు. ఆ కుట్రలో కూటమి ప్రభుత్వం భాగస్వామ్యం కావడం ఆందోళనకరం, ప్రజా వంచన అని దుయ్యబట్టారు. కార్యక్రమంలో ఎపిఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి కె. దేవ సహాయం, ఎఐటియుసి జిల్లా నాయకులు పడాల రమణ, సిఐటియు జిల్లా నాయకులు బి.జగన్, ఎస్.జ్యోతీశ్వరరావు, కెఎం.కుమార మంగళం, ఎం.సుబ్బారావు, వై.రాజు, టి.నూకరాజు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ భవనం వద్ద ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న అయోధ్యరామ్

స్టీల్‌ప్లాంట్ నిర్వీర్యం కాకుండా కాపాడండి

ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ఇఒఐ పేరుతో నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యాల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కార్మిక వర్గం పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొని తమ నిరసనను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు, స్టీల్ యాజమాన్యానికి తెలియజేయాలని స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఇఒఐ, నక్కపల్లి మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు ప్రజాభిప్రాయ సేకరణకు వ్యతిరేకంగానూ, ఆపరేషన్ మైన్స్ కేటాయించాలని కోరుతూ స్టీల్‌ప్లాంట్ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్టీల్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా నుద్దేశించి స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) నాయకులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, ప్యాకేజీ ప్రకటించాంటూ ప్రజలను మభ్యపెట్టి మరోకవైపు ఆపరేషన్‌లో కాంట్రాక్ట్ జోక్యానికి అవకాశం కల్పిస్తూ 46 ఇఒఐలు జారీ చేశారని తెలిపారు. 'సెంటర్ మిషన్ 1, 2 అప్పగిస్తాం, రోజుకు 18 వేల టన్నులు సెంటర్ మాకు ఇవ్వండి' అని ఇఒఐలో పేర్కొన్నారని, దీని అర్థం ఏమిటని ప్రశ్నించారు. ఇది జరిగితే విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అన్న నినాదం మరుగునపడి విశాఖ ఉక్కు-కాంట్రాక్టర్ల హక్కుగా మారిపోతుందని వివరించారు. ఇఒఐని తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని పార్లమెంటులో కేంద్రం ప్రకటించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలని కోరారు.

స్టీల్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ యాజమాన్య అసమర్థ, ఏకపక్ష నిర్ణయాలతో నేడు పూర్తిస్థాయి ఉత్పత్తికి తీవ్ర అవరోధాలు ఏర్పడుతున్నాయని తెలిపారు. సమర్థవంతమైన యాజమాన్యాన్ని నియమించేలా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్ ఐఎన్‌టియుసి చీఫ్ పాటర్న్ మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ, యాజమాన్యం తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ఉద్యోగులపై నెపం మోపుతోందని తీవ్రంగా విమర్శించారు. ఉద్యోగుల సంఖ్య తగ్గించి, అనుభవం ఉన్న కాంట్రాక్టు కార్మికులను తొలగించడం వల్ల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి మిట్టల్‌పై ఉన్న ప్రేమను విశాఖ ఉక్కుపై కూడా చూపించాలని డిమాండ్ చేశారు. గతంలో స్లర్రీ పైప్‌లైన్ కోసం విశాఖ ఉక్కు ఎన్‌ఎండిసితో ఒప్పందం చేసుకుందని గుర్తు చేశారు. మిట్టల్ పరిశ్రమకు ఇదే ఒప్పందాన్ని చేయడం విశాఖ స్టీల్‌కు ద్రోహం చేసినట్టు కాదా అని ప్రశ్నించారు. వీటికి వ్యతిరేకంగా ప్లాంట్ పట్ల నిబద్ధతను, చిత్తశుద్ధిని తెలియజేస్తూ ఈ నెల 29వ తేదీన ఉదయం 8 నుండి 12 గంటల వరకు స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ భవనం వద్ద ధర్నా నిర్వహిస్తామని, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్టీల్ అఖిలపక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు వైటి.దాస్, యు.రామస్వామి, కెఎస్‌ఎన్.రావు, రమణమూర్తి, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా కాయల వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు

కేక్ కట్ చేస్తున్న కాయల వెంకటరెడ్డి

ప్రజాశక్తి-సీతమ్మధార : కెవిఆర్ ఎస్టేట్స్ గ్రూప్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి జన్మదిన వేడుకలను సీతమ్మధారలోని కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో ఏర్పాటుచేసిన కేక్‌ను వెంకటరెడ్డి కట్ చేసి పంచిపెట్టారు. అభిమానులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాయల వెంకటరెడ్డి మాట్లాడుతూ, తన జన్మదిన వేడుకలకు విచ్చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రానున్న కాలంలో కెవిఆర్ ఎస్టేట్స్ మరింత అభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిఆర్ ఎస్టేట్స్ మేనేజింగ్ పార్టనర్ కాయల సూరారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గంట శ్రీనివాసరావు, రవికృష్ణ మురళీకృష్ణ రెడ్డి పాల్గొన్నారు.

సందడిగా చౌక్ బాల్ పోటీలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం పాలవలస అసెంట్ స్కూల్‌లో 16వ జాతీయ జూనియర్ చౌక్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు సందడిగా జరుగుతున్నాయి. దేశం నలుమూలల నుండి 16 బాలలుర జట్లు, 10 బాలికల జట్లు పాల్గొని ప్రతిభను ప్రదర్శిస్తున్నాయి. ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు భారత క్రికెటర్ కెఎస్.భరత్ ప్రత్యేక అతిథిగా హాజరై మాట్లాడుతూ, మారుమూల ప్రాంతంలో జాతీయ స్థాయి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ శంకర్రావు మాట్లాడుతూ, లీగ్ దశలో మొత్తం 42 జట్లు పోటీపడగా, శనివారం రాత్రికి క్వార్టర్ ఫైనల్స్ పూర్తయ్యాయని తెలిపారు. ఆదివారం సెమీఫైనల్స్, ఫైనల్స్ జరుగుతాయని చెప్పారు. విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అందజేస్తారని వెల్లడించారు.

విజ్ఞాన విహార్‌లో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని గుడిలోవ విజ్ఞాన విహార్‌లో శనివారం విద్యార్థులు ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. నీట్ ప్రొఫెసర్ జి.రామశాస్త్రి మాట్లాడుతూ, విద్యార్థులు సృజనాత్మకతతో దేశ సేవలో ముందుండాలని మార్గదర్శనం చేశారు. బివికె.కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ రత్నశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థులు సృజనాత్మకత, నైతిక విలువలు పెంపొందించుకోవాలని కోరారు.

ఈ సందర్భంగా ఫిజిక్స్ విభాగంలో ఆకాష్ స్కేల్ ఆపరేషన్, జల, వాయు, సౌర విద్యుత్ నమూనాలను ప్రదర్శించారు. బయోసైన్స్ విభాగంలో బయోరియాక్టర్, నీటి పారుదల, ఆహార నిల్వ, టైం ట్రావెల్ నమూనాలను, కెమిస్ట్రీలో బొగ్గు నుండి విద్యుత్, పాల నుండి ప్లాస్టిక్, రసాయనిక మూలకాలు, మ్యాథ్స్‌లో త్రికోణమితి, అర్థమెటిక్ ప్రోగ్రామింగ్ నమూనాలు, భాషా విభాగంలో తెలుగు గ్రామీణ పండుగల నమూనాలు, హిందీ విభాగంలో 1962 భారత్-చైనా యుద్ధం, ఆంగ్ల విభాగంలో డ్రామా, రోల్ ప్లే, కామిక్స్ గేమ్స్, సంస్కృతం విభాగంలో రామాయణ ఇతివృత్తం, నలంద విశ్వవిద్యాలయ నమూనాలు, సాంఘిక శాస్త్రంలో సౌరకుంటుంబ నమూనాలు, కంప్యూటర్ విభాగంలో క్వాంటమ్ కంప్యూటింగ్, బ్లాక్ చైన్, డిజిటల్ ఇండియా ప్రాజెక్టులతో పాటుగా సంగీత ప్రదర్శనలు కూడా జరిగాయి.

త్వరితగతిన రుణాలు మంజూరు చేయాలి

బ్యాంకు అధికారులకు జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఆదేశం

ప్రజాశక్తి-అనకాపల్లి

పిఎం సూర్య ఘర్ పథకం సోలార్ రూఫ్‌టాప్‌కు, పరిశ్రమలకు, కౌలు రైతులకు, వ్యవసాయం, డెయిరీ, పౌల్ట్రీ, ఉపాధి రంగాలకు, స్వయం సహాయక బృందాలకు త్వరతగతిన లక్ష్యాలకు మించి రుణాలు మంజూరు చేయాలని బ్యాంకు అధికారులను జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. విద్యా రుణాలకు, యువతకు స్వయం ఉపాధి పథకాలు మంజూరుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ (డిసిసి), బ్యాంకు రుణాలపై జిల్లా స్థాయి సమీక్ష కమిటీ 1వ త్రైమాసిక జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టరు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ నిరర్థక బ్యాంకు ఖాతాదారులను గుర్తించుటకు డిఆర్‌డిఎ, మెప్మా, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సహకారం తీసుకోవాలని సూచించారు. పశు సంవర్ధక, డెయిరీ, మత్స్య పరిశ్రమలలో కాలానుగుణంగా ఉత్పత్తి సాధించే రంగాలకు ఆర్థిక చేయూత నివ్వాలన్నారు. కౌలు రైతులకు కూడా వ్యవసాయ రుణాలు అందించాలని, ఇ క్రాప్ ఆధారంగా వ్యవసాయ రుణాలు మంజూరు చేయాలని కోరారు. జిల్లాలో ఉత్పత్తి అవుతున్న వస్తువులకు బ్రాండింగు, మార్కెటింగు సౌకర్యం

మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

కల్పించాలన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ కె.సత్యనారాయణ గత సమావేశంలో చర్చించిన విషయాలపై తీసుకున్న చర్యలను, రుణ ప్రణాళిక అమలు నివేదికను పవర్ పాయంట్ ప్రజంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. ఈ సమావేశంలో యూనియన్ బ్యాంక్ ఉప ప్రాంతీయ మేనేజర్ శ్రీవాసరావు, ఆర్‌బిఐ ఎల్‌డిఒ రాజేష్ కుమార్ కుంద్, నాబార్డ్ డీడీఎం సమంత్ కుమార్, డైరెక్టర్ ఎస్బిఐ రాజేశ్వరరావు, డిఆర్డిఎ పీడీ కె.శచీదేవి, జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహనరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎం.ఎ.రహీమ్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రసాద్, జిల్లా మత్సశాఖ అధికారి విజయ, వివిధ శాఖల జిల్లా అధికారులు, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

అనకాపల్లి : జిల్లాలో విస్తృతంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తాగునీరు సరఫరా, పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయం నుండి మునిసిపల్ కమిషనర్లు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. తాగునీటి సరఫరా పైపులు లీకేజీలు లేకుండా మంచినీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ప్రతి రోజు క్లోరినేషను చేయాలన్నారు. ప్రైవేటు ఆర్‌ఓ వాటర్ యూనిట్లను కూడా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎక్కడైనా డయేరియా కేసులు నమోదైతే ఉన్నతాధికారులకు తెలియజేయాలని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. డోర్ టు డోర్ చెత్తను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. ఏక్ దిన్.. ఏక్ గంట.. ఏక్ సాత్ స్వచ్ఛత కార్యక్రమంలో ప్రతి ఉద్యోగి పాల్గొనాలని ఆదేశించారు.

జీఎస్టీ ప్రయోజనాలపై విస్తృత ప్రచారం

అనకాపల్లి : జిఎస్‌టి సంస్కరణలను, వాటి ప్రయోజనాలపై విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టరు విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయంలో వాణిజ్యపన్నులు, వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి, పశుసంవర్ధకశాఖ, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ నాలుగు స్లాబులలో గల పన్ను విధానాన్ని రెండు స్లాబులకు కుదించినట్లు చెప్పారు. దీనిపై అక్టోబరు 19వ తేదీ వరకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాలలో జాయింటు కలెక్టరు ఎం.జాహ్నవి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఐద్వా నేతలు, మహిళలు

కార్మికుల పని గంటల పెంపుపై ఐద్వా నిరసన

ప్రజాశక్తి-పరవాడ : కార్మికులకు 8 గంటల పని విధానాన్ని రద్దు చేసి, 13 గంటల పని విధానం తీసుకురావడంపై అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యాన పరవాడలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా మండల అధ్యక్ష, కార్యదర్శులు మన్యాల బంగారమ్మ, తుంపాల అన్నపూర్ణ మాట్లాడుతూ షాపింగ్ మాల్స్, బ్రాండిక్స్, ఎస్ఇజెడ్, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులు ఎనిమిది గంటలు దాటితేనే అలసిపోతున్నారని, అలాంటిది 13 గంటలకు పెంచడం అన్యాయమన్నారు. ఎక్కువ పని భారం వల్ల మహిళా కార్మికులు రక్తహీనత, అనారోగ్యం సమస్యలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 13 గంటల పని విధానం రద్దు చేయాలని, మహిళా చట్టాలను కఠినంగా అమలు చేసి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఎనిమిది గంటల పనికి మించి పని చేస్తే ఓవర్ టైం జీతం ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. ఈ ధర్నాలో సీత, మంగమ్మ, లక్ష్మీ, కనకమాలక్ష్మి, సరోజినీ, ఈశ్వరమ్మ, బేగం, సునీత తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ హెల్త్ కార్డుల రెన్యువల్‌కు నిధులు మంజూరు

ప్రజాశక్తి- అనకాపల్లి : జర్నలిస్టుల హెల్త్ కార్డులు రెన్యువల్‌కు నిధులు మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న జర్నలిస్టుల ఆరోగ్య పథకం రెన్యువల్ కొరకు రూ.3.50 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 2025 సెప్టెంబర్ నెలలో రెన్యువల్ చేసుకున్న అక్రిడిటేషన్ స్లిప్ కలిగి ఉన్న జర్నలిస్ట్‌లు జిల్లా సమాచార పౌర సంబందాల అధికారి కార్యాలయంలో వారి వివరాలు అందజేసి హెల్త్ కార్డులు రెన్యువల్ చేసుకోవాలని కోరారు.

జైల్లో సమస్యలపై న్యాయమూర్తి ఆరా

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి సబ్ జైల్లో సమస్యలపై 12వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టు జడ్జ్ విజయలక్ష్మి ఆరా తీశారు. మండల లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో శనివారం జైలును పరిశీలించారు. నిందితులతో మాట్లాడారు. ఆహారం, పరిశుభ్రత తదితర సమస్యలు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఉచిత న్యాయసహాయం కోరితే కల్పిస్తామని వెల్లడించారు. జైల్ సూపరింటెండెంట్ కిరణ్, న్యాయ సహాయకులు సాయిరాం, తులసీ రామ్, ఎంఎల్ఎస్‌సి ప్రతినిధి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

లంకెలపాలెంలో పోలీసుల ప్రత్యేక తనిఖీలు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని లంకెలపాలెం బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఫార్మాసిటీ వైపు నుండి లంకెలపాలెం వైపు అగైనెస్ట్ డ్రైవ్ చేస్తున్న ద్విచక్ర వాహనదారులపై శుక్రవారం రాత్రి పరవాడ పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో తప్పు దిశలో వాహనం నడిపిన వాహనదారులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. లంకెలపాలెం బ్రిడ్జి వద్ద అగైనెస్ట్ డ్రైవ్ చేయడం అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐ మల్లికార్జునరావు, పోలీసులు పాల్గొన్నారు.

వీల్ చైర్లు పంపిణీ

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వెన్నెలపాలెం గ్రామంలో జనసేన పార్టీ ఆధ్వర్యంలో శనివారం మూడు వీల్ చైర్స్ పంపిణీ చేశారు. జనసేన మండల ఉపాధ్యక్షులు వెన్నెల నరసింహారావు చేతుల మీదుగా అందజేశారు. పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు, జనసేన మండల ఇంచార్జ్ పంచకర్ల ప్రసాద్ ప్రోత్సాహంతో ఈ సేవా కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వైస్ ప్రెసిడెంట్ వెన్నెల సన్యాసిరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వీల్ చైర్ అందజేస్తున్న నరసింహారావు తదితరులు

గణేష్‌ను సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు

పారా వాలీబాల్ వరల్డ్ కప్‌కు గణేష్ ఎంపిక

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : అమెరికాలో అక్టోబర్ 12 నుండి 18 వరకు నిర్వహించే అంతర్జాతీయ పారా వాలీబాల్ వరల్డ్ కప్ పోటీలకు శ్రీప్రజ్ఞ జూనియర్ కాలేజీ పూర్వ విద్యార్థి అన్నం గణేష్ ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.రాము తెలిపారు. ఈ మేరకు శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గణేష్‌ను సత్కరించి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ మండలంలో సోమదేవిపల్లి గ్రామానికి చెందిన అన్నం గణేష్ 2016-18 సంవత్సరంలో తమ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జోగినాదం, రమేష్, ప్రకాష్, రాజు, కుమార్, రాము, అలేఖ్య, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

కోచింగ్ నిర్వహణకు సీల్డ్ టెండర్లు ఆహ్వానం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపి ప్రభుత్వం, సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్, పోటీ పరీక్షల కోచింగ్ నిర్వహణకు ప్రముఖ కోచింగ్ సంస్థల నుండి సీల్డ్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లా సమన్వయకర్త జి.గేస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 అక్టోబర్ నుండి తిరుపతి, విశాఖపట్నంలోని స్టడీ సర్కిళ్లలో ఎస్ఎస్సి, ఐబీపీఎస్-ఆర్ఆర్బి, ఐబీపీఎస్ (పీవోస్, క్లర్కులు) మెయిన్స్/ టైర్-2 స్థాయి పరీక్షలకు ఉచిత కోచింగ్ ప్రారంభిస్తున్నట్లు ఆమె తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఎస్సీ-80శాతం, ఎస్టి-6శాతం, బీసీ-10శాతం, ఓసీ-4శాతం, పిడబ్ల్యూడి-3శాతం కోచింగ్ సంస్థలు నిరూపిత ఫలితాల అనుభవం, ప్రామాణిక మెటీరియల్, క్రమబద్ధమైన మూల్యాంకన పద్ధతులను కలిగి ఉండాలని కోరారు. దరఖాస్తులు సంబంధిత పత్రాలు, రూ.50,000 తిరిగి చెల్లించదగిన ఈఎండితో అక్టోబర్ 10 సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలని, అదే రోజు 5.15 గంటలకు టెండర్లు తెరవడం జరుగుతుందని పేర్కొన్నారు. వివరాలకు డైరెక్టర్, ఏపీ స్టడీ సర్కిల్, డాక్టర్ బిఆర్. అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ భవన్, అరండల్పేట, విజయవాడను సంప్రదించవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 6303443409 నెంబర్ కు సంప్రదించాలన్నారు. టెండర్ ఫార్మ్ ఉదయం 10 నుండీ సాయంత్రం 5 వరకు లభ్యమవుతాయని పేర్కొన్నారు.

భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్వాతంత్ర్య సమరయోధుడు, యువకిశోరం సర్దార్ భగత్ సింగ్ స్ఫూర్తితో ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి శ్రీనివాసరావు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ అతి చిన్న వయస్సులోనే దేశం కోసం ప్రాణాలర్పించారని తెలిపారు. నేడు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికులకు ఎనిమిది గంటల పనివిధానాన్ని మార్చి 13 గంటల పని విధానం తీసుకొస్తున్నారని తెలిపారు. ఇది కార్మికులను మరింత దోపిడీ చేయడమే

భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలతో నివాళులర్పిస్తున్న దృశ్యం

అవుతుందన్నారు. అసంఘటిత రంగం, వివిధ ప్రభుత్వ స్కీమ్‌ల్లో పని చేస్తున్న వర్కర్లు వెట్టి చాకిరీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరికి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు మండల కన్వీనర్ బిటి.దొర, విఒఎల సంఘం మండల అధ్యక్షులు సూరిబాబు, నాయకులు గర్రెడ్డి కొండలరావు, అప్పారావు, జ్యోతి, వెంకటలక్ష్మి, అధిక సంఖ్యలో విఒఎలు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత వసతితో కూడిన శిక్షణ

ప్రజాశక్తి-అనకాపల్లి : పలు పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచిత వసతి సౌకర్యంతో కూడిన శిక్షణ కార్యక్రమం కొరకు అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు జిలా ఇన్‌చార్జి కోఆర్డినేటర్ ఎన్.రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఐబిపిఎస్‌లో క్లర్క్, ప్రొబేషనరీ ఆఫీసర్, ఆర్‌ఆర్‌బిలో ఆఫీసర్ స్కేల్ -2, 3, ఆఫీస్ అసిస్టెంట్ ఉద్యోగాలకు , ఎస్ఎస్‌సిలో సిజిఎల్ టియర్-11 వంటి పోటీ పరీక్షల టైర్ -2 లేదా మెయిన్ పరీక్షల కోసం శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు తప్పనిసరిగా గ్రాడ్యుయేట్ డిగ్రీ కలిగి ఉండాలని, సంబంధిత పరీక్షల టైర్-1 ప్రిలిమినరీ పరీక్ష రాసి ఉండాలని (ఫలితాల కోసం ఎదురుచూస్తున్నవారు కూడా అర్హులు), కుటుంబ వార్షికాదాయం రూ.6లక్షల లోపు ఉండాలి (ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు) ఉచిత వసతి సౌకర్యంతో కూడిన రెసిడెన్షియల్ శిక్షణ 60 రోజులు పాటు తిరుపతి, విశాఖపట్నం స్టడీ సర్కిల్స్ నందు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు ఆన్లైన్‌లో అక్టోబర్ 10వ తేదీలోపు అందజేయాలన్నారు. స్క్రీనింగ్ టెస్ట్ అక్టోబర్ 12న నిర్వహించి, 22వ తేదీ నుండి శిక్షణ ప్రారంభించడం జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ కుల, ఆదాయం, విద్యార్హత సర్టిఫికెట్లు, ఫోటో, టియర్-1 పరీక్ష వివరాలతో కూడిన దరఖాస్తులను https://apstdc.apcfss.in నందు తప్పనిసరిగా అప్లోడ్ చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు బి.ఆర్.అంబేద్కర్ స్టడీ సర్కిల్, జిల్లా కోఆర్డినేటర్, ఏపీఎస్డబ్ల్యూఆర్ఈఐఎస్, అనకాపల్లి కార్యాలయాన్ని లేదా 9440280275 / 7995562114 మొబైల్ నెంబర్లకు సంప్రదించవచ్చని తెలిపారు.

లేజర్ ప్రదర్శన, క్యాంటీను వినియోగంలోకి తేవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : బొజ్జన్నకొండ వద్ద నూతనంగా నిర్మించిన లేజర్ స్క్రీన్ థియేటర్, కాంటీన్‌ను వినియోగంలోకి తేవాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్లకార్డులతో నిరసన తెలిపారు. అంతర్జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని నెహ్రు చౌక్ జంక్షన్‌లోని బుద్ధుని విగ్రహం వద్ద జరిగిన నిరసన అనంతరం ఆర్‌డిఒ షేక్ ఆయేషాకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు బొడ్డు సోమరాజు, అయ్యగారి వెంకటరమణమూర్తి, కాపారపు సత్యనారాయణ, జిల్లా బుద్దిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షులు పల్లాబాబ్జీ , కార్యదర్శి బండి అప్పా రావు, పొట్టి శ్రీరాములు భవన్ సంస్థ నిర్వాహకులు పిరాట్ల నరసింహమూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తహశీల్దారు భుజంగరావు

పౌరులు హక్కులను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : గ్రామాల్లో నివసించే పౌరులు తమ హక్కులను వినియోగించుకోవాలని మండల తహశీల్దారు భుజంగరావు అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని ఆర్‌వై అగ్రహారంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని, వారి అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ లెక్కల అచ్చిబాబు, పంచాయితీ సెక్రటరీ ప్రవీణ్, వీఆర్వో గంగునాయుడు, తలారి ముత్యాలనాయుడు, గ్రామ యువత, పెద్దలు పాల్గొన్నారు.

భరత్‌ను కలిసిన బొడ్డేడ ప్రసాద్

ప్రజాశక్తి-కశింకోట : వైసిపి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం సమన్వయకర్తగా నియమితులైన బొడ్డేడ ప్రసాద్ శనివారం మండలంలోని ఎన్.పేటలో ఆ పార్టీ అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్ కుమార్‌ను కలిశారు. భరత్ కుమార్ తల్లిదండ్రులు మలసాల రమణారావు ధనమ్మ ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం బొడ్డేడ ప్రసాద్‌ను గజమాల, సాలువాతో సత్కరించారు. బొడ్డేడ ప్రసాద్ కూడా రమణారావు ధనమ్మ దంపతులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మలశాల కిషోర్, గొల్లవిల్లి శ్రీను, మలసాల కుమార్ రాజా తదితరులు పాల్గొన్నారు

పాడి రైతులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-పరవాడ : ఒక్క పాడి పశువుతో జీవనోపాధి సాగిస్తున్న రైతులకు రెండో పశువును కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని పశుసంవర్ధకశాఖ సబ్ డివిజనల్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రామకష్ణ కిర్తి అన్నారు. పరవాడలో శనివారం పశుసంవర్ధక శాఖ, వెలుగు, డిఆర్‌డిఎ శాఖల సంయుక్త కన్వర్జెన్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ఆదాయం పెరిగి జీవన ప్రమాణాలు మెరుగుపడటమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డు పథకం గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో వాడచీపురుపల్లి, లంకెలపాలెం పశువైద్యాధికారులు డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ అనూష, వెలుగు శాఖ ఏపిఎం రంగారావు, వివోఏలు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ముద్రగడను కలిసిన చిక్కాల

ప్రజాశక్తి-పాయకరావుపేట : మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంను శనివారం కిర్లంపూడిలోని ఆయన స్వగృహంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రామారావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు గెడ్డమూరి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ధనిశెట్టి బాబురావు, జగతా శ్రీనివాస్, సర్పంచ్ పన్నీరు పాపారావు, టౌన్ ప్రెసిడెంట్ ధనిశెట్టి మహేష్, ధనిశెట్టి తులసి తదితరులు పాల్గొన్నారు.

జాగృతి వ్యవస్థాపకులు రామకృష్ణ జయంతి

ప్రజాశక్తి-సబ్బవరం : స్థానిక జాగృతి స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో ఆ సంస్థ వ్యవస్థాపకులు కె.రామకృష్ణ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా సంస్థ విచ్చేసిన ఆడిటర్ వడ్డమాని సుధాకరరావు మాట్లాడుతూ రామకృష్ణ జాగృతి స్వచ్ఛంద సంస్థను స్థాపించి గ్రామీణ ప్రాంత ప్రజలకు చేయూతనిచ్చారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కందర్ప సుజాత, డైరెక్టర్ వెనుపూడి రమణ, రైతు ఉత్పత్తిదారుల పాలకవర్గ సభ్యులు, రైతులు, గ్రామ ప్రతినిధులు సుమారు 3000 మంది పాల్గొన్నారు.

రామకృష్ణ విగ్రహానికి పూలతో నివాళులర్పిస్తున్న సంస్థ ప్రతినిధులు

బిల్లులు, వేతన బకాయిలు చెల్లించాలి

మిడ్డేమీల్స్, స్కూల్ శానిటేషన్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-కశింకోట : మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు బకాయి పడ్డ మెనూ బిల్లులు, మూడు నెలల వేతనాలు, స్కూల్ శానిటేషన్ వర్కర్లకు బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ స్థానిక ఎంఇఒ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. దీనికి ముందు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నుండి ఎంఇఒ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. బకాయిలు తక్షణమే చెల్లించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఎండిఎం యూనియన్ నాయకులు ఎం.శ్రీదేవి, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు శివలక్ష్మి, ఐద్వా జిల్లా కార్యదర్శి డి.వరలక్ష్మి మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు, మెనూ బిల్లులు ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోడల్ స్కూల్, జూనియర్‌కాలేజీల్లో విద్యార్థులకు వండుపెడుతున్న భోజన పథకం కార్మికులకు తొమ్మిది నెలల నుండి మెనూ బిల్లులు ప్రభుత్వం చెల్లించలేదని, ఇలా అయితే కార్మికులు ఎక్కడ నుండి తెచ్చి పిల్లలకు భోజనాలు వండిపెడతాయని ప్రశ్నించారు. పాఠశాలలో పనిచేసే శానిటేషన్ వర్కర్లకు వేతనాలు ఇవ్వడం లేదన్నారు. మిడ్డేమీల్స్, స్కూల్ శానిటేషన్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యాలు కలించాలని, యూనిఫారాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన బియ్యం, వంటకి సరిపడా గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయాలని, పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు, వేతనాలు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు ధనలక్ష్మి, మాలెమ్మ, బి.వరలక్ష్మి, పి.అప్పలనరస, సిహెచ్.వెంకయ్యమ్మ, ఎం.లక్ష్మి, ఎం.సన్యాసమ్మ, ఎం.నూకరత్నం, ఎన్.మంగా, పి.సునీత, యు.నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎంఇఒ ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్న ఎండిఎం కార్మికులు

వివోఎల సమస్యలపై దశలవారీ పోరాటం

సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-దేవరాపల్లి : వెలుగు వివోఏలకు మూడేళ్ల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, ఆన్‌లైన్ పనులకు 5జి మొబైల్స్ ఇవ్వాలని, గ్రూప్ ఇన్సూరెన్స్, గుర్తింపు కార్డులు తదితర సమస్యల పరిష్కారానికి అక్టోబర్ ఒకటో తేదీ నుంచి దశలవారీగా పోరాటానికి సిద్ధం కావాలని ఏపీ వెలుగు వివోఏ (యానిమేటర్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) జిల్లా గౌరవాధ్యక్షులు, సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. దేవరాపల్లి సిఐటియు కార్యాలయంలో శనివారం జరిగిన వెలుగు వివోఏల మండల జనరల్ బాడీ సమావేశానికి శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వెలుగు వివోఏలు కొన్నేళ్లుగా ఆన్లైన్ వర్క్ కోసం 5జి మొబైల్స్ ఇవ్వాలని అనేక ఆందోళన పోరాటాలు చేసిన నేటికీ ఇవ్వకపోవడం దారుణమన్నారు. వెంటనే ఇవ్వకపోతే అక్టోబర్ ఒకటో తేదీ నుంచి ఆన్లైన్ పనులు నిలుపుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని డిమాండ్‌పై ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి నేతలు, ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా నేటికీ రద్దు చేయలేదని, తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సూరిబాబు, రాము, అప్పారావు, వెంకటలక్ష్మి, లక్ష్మి, వరలక్ష్మి, అధిక సంఖ్యలో వివోఎలు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : విస్తృతంగా వర్షాలు కురుస్తున్న కారణంగా గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి పూర్ణిమా దేవి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వీధి కుళాయిలు, మంచినీటి బోర్ల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. ప్రతిరోజు వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. అనంతరం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, తహశీల్దారు భుజంగరావు, పంచాయితీ కార్యదర్శులు, విఆర్ఓలు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని కాశీపురం పంచాయతీలో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారిణి మంజులవాణి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం కలిగించారు. ఇంటింటికీ వెళ్లి జీఎస్టీపై అవగాహన కల్పించారు. శానిటేషన్‌పై నిరంతర పర్యవేక్షణ కొనసాగాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కిరణ్ వరప్రసాద్, సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, వెలుగు ఏపిఎం ప్రభాకరరావు, హౌసింగ్ ఇంచార్జ్ ఏఈ తేజ, ఇంచార్జ్ పంచాయతీ కార్యదర్శి అనంత ఉమాదేవి, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ త్రినాథ్ పాల్గొన్నారు.

యలమంచిలి : మున్సిపాలిటీ పరిధి సన్యాసమ్మ చెరువు దగ్గర శనివారం స్వచ్ఛత - శ్రమదానం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, కమిషనర్ ప్రసాదరాజు, స్పెషల్ ఆఫీసర్ కె.సత్యనారాయణ పాల్గొని పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. తుప్పలను, అక్కడున్న చెత్తను తొలగించారు. కార్యక్రమంలో శానిటరీ ఇనస్పెక్టర్ వల్లి శ్రీనివాసరావు, ఏఇ గణపతి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుండి ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై ఈ నెల 28 నుండి మండలంలో 18వ విడత సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎన్ఆర్ఇజిఎస్ ఏపీఓ అప్పలరాజు తెలిపారు. శనివారం అన్ని శాఖల సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ గతఏడాది ఏప్రిల్ నుండి ఈ సంవత్సరం మార్చి వరకూ జరిగిన పనులకు తనిఖీ చేయడానికి సామాజిక తనిఖీ బృందం సిద్ధమైనట్లు చెప్పారు. పంచాయతీ రాజ్, అటవీ, ఎస్-ఎస్ఎ శాఖల ద్వారా చేపట్టిన పనులపై ఆడిట్ నిర్వహిస్తారన్నారు. సమావేశంలో ఎన్ఆర్ఇజిఎస్ ఏపీడీ శ్రీనివాసరావు, ఫారెస్ట్ డిఆర్ఓ నూకరాజు, హౌసింగ్ ఏఈ రాము, ఎస్ఎస్ఎ ఇంజనీరు అప్పలనాయుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పిఎసిఎస్ అధ్యక్షులు జనార్ధన్

పిఎసిఎస్ మహాజన సభ

ప్రజాశక్తి-కోటవురట్ల : మండల కేంద్రంలో శనివారం పిఎసిఎస్ అధ్యక్షులు జనార్ధన్ అధ్యక్షతన మహాజన సభ జరిగింది. ఇందులో పాల్గొన్న టిడిపి నాయకులు కాశీనాయుడు మాట్లాడుతూ ప్రస్తుతం రూ.16 కోట్లు వరకు జరుగుతున్న లావాదేవీలను రూ.30 కోట్ల వరకు పెంచాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ రైతుల నుంచి వసూలు చేసే షేర్ క్యాపిటల్ ధనాన్ని రద్దు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పిఎసిఎస్ అధ్యక్షులు జనార్ధన్ మాట్లాడుతూ రైతులకు మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి దత్తుదొరాజు, బికే పల్లి సర్పంచ్ లింగన్న నాయుడు, జనసేన మండల అధ్యక్షులు శ్రీనివాస్, సొసైటీ సభ్యులు సుంకర బాబ్జి, చిటికెల సత్యనారాయణ, రాజుపేట సర్పంచ్ వెంకటరమణ, తిరుమలరావు, ఎంపీటీసీ సూర్యారావు, పాల్గొన్నారు.

పోషణ మాసోత్సవాల ర్యాలీ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని నేతవానిపాలెంలో బుచ్చయ్యపేట సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు శనివారం పోషణ పక్వాడ మాసోత్సవాలలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మంగతాయారు మాట్లాడుతూ తల్లీబిడ్డల సంరక్షణలో కార్యకర్తలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నిర్మల అంగన్వాడీ కార్యకర్తలు వై.పైడితల్లమ్మ, జె.వెంకటలక్ష్మి, జి. చిలకమ్మ ఆది వరలక్ష్మి అడ్డిపల్లి లక్ష్మి పాల్గొన్నారు.

టీకాలు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-సబ్బవరం : పశువులకు ఉచితంగా వేస్తున్న గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పాడి రైతులు వినియోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ విశాఖ డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ కోరారు. మండలంలోని మొగలిపురం, సబ్బవరం పంచాయతీ గోపాల్‌నగర్‌లో నిర్వహించిన టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆయన పర్యవేక్షించారు. అనంతరం గొట్టివాడ గ్రామీణ పశు వైద్య కేంద్రంలో సంపూర్ణ తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కె.ఉషాకుమారి, ఎహెచ్ఎ త్రినాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఐదు రోజుల్లో కాజ్‌వే పనులు పూర్తి

ప్రజాశక్తి-చోడవరం : ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయిన విజయరామరాజుపేట వద్ద తాచేరు కాజ్‌వే పనులు ఐదు రోజుల్లో పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని ఆర్ అండ్ బి ఈఈ సాంబశివరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాజ్‌వే కొట్టుకుపోవడం వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని రూ.17 లక్షలతో టెండర్లు ఖరారు చేసి తక్షణమే పనులు ప్రారంభించామని చెప్పారు. వడ్డాది కాజ్‌వే పనులకు రూ.7 లక్షలు మంజూరయ్యాయని, ప్రస్తుతం రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేవని పేర్కొన్నారు.

నేటి నుండి హాకీ టోర్నమెంట్

ప్రజాశక్తి-యలమంచిలి : 5ఎ సైడ్ హాకీ లీగ్ టోర్నమెంట్ యలమంచిలి డిగ్రీ కళాశాల రాజీవ్ కళాశాల మైదానంలో ఈ నెల 28 ఆదివారం నుండి మూడు రోజుల పాటు జరుగుతుందని అనకాపల్లి జిల్లా హాకీ కన్వీనర్ నరేష్, ప్రతినిధులు జివి రెడ్డి, రమేష్, మహేష్, జి.రాంబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 28, 29, 30 తేదీల్లో జరిగే కార్యక్రమంలో 6 క్లబ్ జట్లు పాల్గొంటున్నాయని పేర్కొన్నారు.

పోటీలకు సిద్ధమైన క్రీడాకారులు

ప్రజాశక్తి 7
ఆదివారం 28 సెప్టెంబర్ 2025

సమస్యలను ప్రస్తావిస్తున్నాం.. పరిష్కారమేదీ?

-నర్సీపట్నంలో అపారిశుధ్యం - మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ విజయలక్ష్మి

ప్రజాశక్తి-నర్సీపట్నంసమస్యలు పరిష్కారం కానీ సమావేశాలు ఎందుకంటూ శనివారం మున్సిపల్ చైర్మన్ బోడపాటి సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన మున్సిపల్ సమావేశంలో 18వ వార్డు కౌన్సిలర్ శెట్టి విజయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. 500 కోట్లు ఖర్చు చేశామంటూ కాగితాల్లో లెక్కలు చూపిస్తున్నారని, కనీసం సభ్యులకు కూడా తెలియకుండా నిధులు ఖర్చు చేయడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. పవిత్రమైన ఉత్తరవాహిని నది అపారిశుధ్యంతో కొట్టుమిట్టాడుతుంటే మున్సిపల్ శాఖ అధికారులు ఎవరూ పట్టించు కోలేదని, భూగర్భ జలాలన్నీ కలుషితమై పోతున్నాయని తెలిపారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల సభలో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సీపట్నం మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడ చూసినా అపారిశుధ్యం తాండవిస్తుందని, మురికి నీరు రోడ్లపై ప్రవహిస్తున్నా పట్టించుకున్న నాధుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమై గోతులమయమై దర్శనమిస్తున్నా మరమ్మతు చేసే దిశగా అధికారులు, కూటమి నాయకులు ఎవరూ పట్టించుకోకపోవడం పట్ల ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన కమిషనర్ సురేంద్ర మాట్లాడుతూ నిధులను పారదర్శకంగా ఖర్చు పెడుతున్నామన్నారు. సభ్యుల దృష్టికి తీసుకు వెళ్లక పోవడం లేదని, వారి ఆమోదం మేరకే పనులు మొదలు పెడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి కౌన్సిలర్లు, టిడిపి కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కౌన్సిలర్ విజయలక్ష్మి.

'అధికారులు ప్రొటోకాల్ పాటించలేదు'

ప్రజాశక్తి:రావికమతం:ప్రజా ప్రతినిధిగా కొనసాగు తున్న తమకు అధికారులు నిర్వహిస్తున్న కార్యక్రమాలకు సమాచారం ఇవ్వలేదని, ప్రోటోకాల్ ను ఉల్లంఘిస్తున్నారని గొంప ఎంపీటీసీ గెంజి సూర్యనారాయణ శనివారం వైద్య సిబ్బందిపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ, గతంలో పలుమార్లు ప్రోటోకాల్ పాటించమని పలు సందర్భాలలో తెలియపరచినప్పటికీ అధికారులలో ఎటువంటి మార్పు రాకపోవడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ప్రజలు ప్రజాప్రతినిధులుగా ఓటు వేసి ఎన్నుకున్న తమను అవమాన పరచడం చాలా బాధాకరమన్నారు. ప్రజాప్రతినిధులు కాని వారిని కార్యక్రమాలుకు హాజరు పరచడం, ప్రజా ప్రతినిధులను పక్కన పెట్టడం ఎంతవరకు సమంజసం అని ఆయన ప్రశ్నించారు. గొంప సెగ్మెంట్‌లో గొంప,గుడ్డిప, గుడ్డి కొత్తూరు, తదితర గ్రామాలలో ప్రభుత్వపరంగా ఏ కార్యక్రమం చేపట్టినా ప్రోటోకాల్ పాటించాలని ఆయన డిమాండ్ చేశారు.ప్రోటోకాల్ ప్రకారం సమాచారం అందించి కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేసే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజాప్రతినిధులకు ప్రతి కార్యక్రమానికి సమాచారం అందజేయాలని లేని పక్షంలో జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన హెచ్చరించారు.

రావికమతంలో అవగాహన కల్పిస్తున్న అధికార్లు

జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి-రావికమతం:ప్రభుత్వం తగ్గించిన జిఎస్టి పై ప్రజలు అందరూ అవగాహన పెంచుకోవాలని ఎంపీడీవో మహేష్, తహసిల్దార్ అంబేద్కర్ కోరారు. రావికమతంలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు వద్ద ప్రజలతో శనివారం అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం జిఎస్టిని భారీ స్థాయిలో తగ్గించినప్పటికీ పలు దుకాణాల యజమానులు పాత జిఎస్టి ప్రకారమే వ్యాపారాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. ప్రజలు సరుకులు కొనుగోలు చేసేటప్పుడు తగ్గించిన జిఎస్టి ప్రకారమే తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ, ఎం అప్పారావు (కొండయ్య) మహిళలు పలువురు పాల్గొన్నారు.

చోడవరం : సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ అంశంపై చోడవరం పట్టణంలో మండల ప్రత్యేకాధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో అధికారులు స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయులు, మండల ఇంజనీరు శాంతారామ్, పంచాయతీ ఓకే శ్రీనివాసరావు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామంలో శనివారం జిఎస్‌టి 2.0పై ప్రజలకు అవగాహన కల్పించారు. స్వయం సహాయక సంఘాల మహిళలు డోర్ టు డోర్ కాంపెయిన్ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

విఆర్‌ఒపై చర్యలు తీసుకోవాలి

-బాధిత మహిళ ధర్నా

ప్రజాశక్తి-రావికమతం:తన తల్లి పేరనున్న భూమిని వేరొక వ్యక్తికి ఆన్‌లైన్ చేసిన విఆర్‌ఓ సాసుబిల్లీ ప్రసాద్‌ను సస్పెండ్ చేయాలంటూ శనివారం మజ్జి జగదీశ్వరి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నాకు దిగింది. ఆమె తెలిపిన వివరాల ప్రకారం మండలంలో గర్ణికం గ్రామానికి చెందిన తన తల్లి నారం శెట్టి పైడితల్లమ్మ పేరున ఉన్న భూమిని రీ సర్వేలో కేశం శెట్టి చెంచునాయుడు, నారం శెట్టి రమణమ్మ పేరున రెండు సర్వే నెంబర్లు, ఒక సర్వే నెంబర్ లో 40 సెంట్లు,మరొక సర్వే నెంబర్ లో 48 సెంట్లు భూమిని రెవెన్యూ, సర్వే అధికారులు తప్పుగా నమోదు చేయడం జరిగిందన్నారు.ఈ విషయాన్ని ఇదివరకే నర్సీపట్నం ఆర్డిఓ, రావికమతం తహసిల్దారు దృష్టికి తీసుకువెళ్లగా ఎవరి పేరున భూమి నమోదు అయిందో వారి వద్ద నుంచి విల్లింగ్ లెటర్ తీసుకుని మ్యుటేషన్ పెట్టామని చెప్పారన్నారు. ఇలా నాలుగు దఫాలు మోటేషన్ పెట్టడం జరిగిందన్నారు. పెట్టిన ప్రతిసారి వీఆర్వో రిజెక్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమను లక్ష రూపాయలు డబ్బులు అడిగితే తాము ఇవ్వలేమని చెప్పిన కారణంగా వేరొక వ్యక్తి వద్ద తీసుకొని వారి పేరున వీఆర్వో ఆన్‌లైన్ చేశారని ఆరోపించారు. స్పందించిన తహసిల్దారు అంబేద్కర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, అంతవరకు ధర్నా చేయవద్దని చెప్పడంతో ఆమె ధర్నాను విరమించుకుంది.

అసెంబ్లీలో సమస్యల ప్రస్తావనపై హర్షం

ప్రజాశక్తి-గొలుగొండ:గ్రామీణ వైద్యులపై సమస్యలపై శాసనసభలో గళం విప్పిన విజయవాడ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ నాయుడుకి ధన్యవాదాలు తెలుపు కుంటున్నామని నర్సీపట్నం డివిజన్ ఉమ్మడి విశాఖ జిల్లా సంఘం అధ్యక్షులు బొప్పన లక్ష్మణరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన కేడీపేటలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యం అందుబాటులో ఉన్నది అంటే అది గ్రామీణ వైద్యుల తోటే సాధ్యమవుతుందని అన్నారు. అటువంటి గ్రామీణ వైద్యుల సమస్యలపై అసెంబ్లీలో శాసనసభ్యులు రామ్మోహన్ నాయుడు చర్చించడం హర్షించదగ్గ పరిణామన్నారు. అందుకోసం గ్రామీణ ప్రాంత వైద్యుల యూనియన్ రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకుల తరపున ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని ఆయన తెలిపారు.

ఆందోళన చేస్తున్న మత్స్యకారులు, నాయకులు

బల్క్ డ్రగ్‌తో జీవితాలను బుగ్గిపాలు చేయొద్దు

-కొనసాగిన మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి- నక్కపల్లి:బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ జీవితాలను బుగ్గిపాలు పాలు చేయొద్దని మత్స్యకారులు అన్నారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు శనివారం నాటికి 14వ రోజుకు చేరింది. మత్స్య కార సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఉమ్మడి మహేష్, మాజీ అధ్యక్షులు కదిరి పోలరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కదిరి గురునాథ రావు, రాష్ట్ర స్కిల్ డెవలప్మెంట్ ప్రెసిడెంట్ పేర్ల వెంకటేష్ తదితర నాయకులు మత్స్యకారుల ఉద్యమానికి సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి మత్స్యకారుల ఉనికి ఉపాధిని దెబ్బతీయొద్దన్నారు. మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని బల్క్ డ్రగ్ ను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు పిక్కి సత్తియ్య, మైలపల్లి మహేష్ బాబు, నాయకులు బి బాబ్జి, పిక్కి పిక్కి తాతీలు ఎరిపిల్లి నాగేష్, వై అప్పలరాజు, బి.శ్రీను, మాధవ, కాశి, మాధవరావు, కాశీ, శివ, శ్రీను, వి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు..

కండువా వేస్తున్న నాయకులు

పార్టీ కోసం పని చేస్తే తగిన గుర్తింపు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: నాతవరం మండలం లింగంపేట పంచాయతీ బుచ్చంపేట గ్రామానికి చెందిన బొడ్డు శేఖర్ ఆధ్వర్యంలో దళితవాడకు చెందిన పలువురు జనసేన పార్టీలో శనివారం చేరారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర వీరందరికీ పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. అనంతరం సూర్యచంద్ర మాట్లాడుతూ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించిన వారికి గుర్తింపు లభిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి అల్లాడ సురేష్, మండల పార్టీ అధ్యక్షులు వెలగల వెంకటరమణ, సీనియర్ నాయకులు పోలుపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న పద్మావతి

ఆరో వార్డులో వైద్య శిబిరం

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: మున్సిపాలిటీ 6వ వార్డు గవర వీధిలో ఉచిత మెడికల్ క్యాంపును కౌన్సిలర్ చింతకాయల పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని, ఇలాంటి కార్యక్రమాలు ప్రజల ఆరోగ్య రక్షణకు దోహదపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి అల్లాడ సురేష్, కర్రి సందీప్, మార్కెట్ రాజా, మల్ల పెట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో రావికమతం పీహెచ్సీ పరిధిలో గుడ్డిప గ్రామంలో స్వస్త్ నారి స్వశక్తి పరివార్‌లో భాగంగా ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. పీహెచ్సీ వైద్యాధికారినీ నలిని పుష్ప పలువురు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారినీ మాట్లాడుతూ,ఆరోగ్యం పై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుత సీజన్లో మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున కాచిన వేడినీటినిసాగాలని ఆమె సూచించారు.గ్రామాలలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఇల్లు, గ్రామం పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరికి వయసుతో సంబంధం లేకుండా జబ్బులు రావడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుడ్డిప సర్పంచ్ గుమ్మాల గణేష్, గల్లా రాజేశ్వరరావు, రావికమతం పిహెచ్సి సిహెచ్ఓ హేమ సుందర్‌రావు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని పాతమల్లంపేట గ్రామ పంచాయతీలో సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి ఆనంద్ అధ్యర్యంలో శనివారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ద తీసుకుని కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్ రాఘవ, వైద్య సిబ్బంది నాయుడు, పంచాయతీ కార్యదర్శి రమణమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హైడ్రోపై అరణ్య గర్జన

- ప్రాజెక్టుల పేరిట ముంచితే ఊరుకోం
- పాలకులారా ఖబడ్దార్ : వి.శ్రీనివాసరావు, సురేంద్ర, అప్పలనర్స తదితరులు
- మజ్జివలసలో భారీ బహిరంగ సభ, ర్యాలీ
- వేలాదిగా కదిలొచ్చిన ఆదివాసీలు

విల్లు ఎక్కుపెడుతున్న వి.శ్రీనివాసరావు, వేదికపై అప్పలనర్స, సురేంద్ర, గంగరాజు తదితరులు

ప్రజాశక్తి - అరకులోయ రూరల్ : తమను జల సమాధి చేసే హైడ్రో పవర్ ప్రాజెక్టులు వద్దంటూ ఆదివాసీలు గర్జించారు. ఆ ప్రాజెక్టులకు అనుమతుల కోసం జారీ చేసిన జిఒలు 51, 13, 2లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అడవులను కార్పొరేట్ కంపెనీలకు అమ్మొద్దని, హైడ్రో పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసి గిరిజనులను జల సమాధి చేయొద్దని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం, హైడ్రో పవర్ ప్రాజెక్టు వ్యతిరేక కమిటీ ఆధ్వర్యాన హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ మజ్జివలసలో శనివారం ఆదివాసీ అరణ్య గర్జన సభ జరిగింది. తొలుత ఏజెన్సీ నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన ఆదివాసీలంతా భారీ ప్రదర్శన చేపట్టారు. తమ పట్ల పాలకుల తీరును నిరసిస్తూ నినాదాలతో హోరెత్తించారు. ర్యాలీ అనంతరం జరిగిన సభకు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కృష్ణారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసి గిరిజనులను జల సమాధి చేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. ఇప్పటికే ఏజెన్సీలో అడవులు, జీవరాశులను పాలకులు నాశనం చేసేశారన్నారు. పర్యావరణం పూర్తిగా ధ్వంసమైందన్నారు. ఎప్పుడు వర్షం వస్తుందో, రాదో కూడా తెలియని పరిస్థితి నెలకొందన్నారు. ఉన్న ఈ ప్రకృతిని కూడా నాశనం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూస్తున్నాయన్నారు. కార్పొరేట్ శక్తుల లాభాల కోసం అడవులను కట్టబెడుతున్నాయన్నారు. అంతర్జాతీయ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ జనాలు నివాసం లేని చోట, పంటలు పండనిచోట ప్రాజెక్టులు, పరిశ్రమలు పెట్టుకోవాలని చెబితే దానికి విరుద్ధంగా ఏజెన్సీలో పాలకుల చర్యలు ఉన్నాయన్నారు. గిరిజనులు అంటే ప్రభుత్వానికి లెక్క లేదన్నారు. ప్రాజెక్టులు, ఉద్యోగాల పేరిట ప్రజలను నమ్మించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో సీలేరు జెన్కోలో విద్యుత్ ప్రాజెక్టు ఉందని, అక్కడ 250 మంది ఉద్యోగులు ఉన్నారని, వారిలో గిరిజనులు 20 మంది మాత్రమే ఉద్యోగులుగా ఉన్నారని తెలిపారు. వంద, రెండు వందల ఉద్యోగాల కోసం వేలాది మంది గిరిజనులు, పంట పొలాలను జల సమాధి చేస్తామంటే ఆదివాసీలు చూస్తూ ఊరుకోరన్నారు. అదానీ, నవయుగ, షిరిడీ సాయి కంపెనీలకు ఏజెన్సీని కట్టబెట్టేందుకు ప్రభుత్వాలు కుట్రలు పన్నాయన్నారు. జిఒ 3 పునరుద్ధరణ విషయంలో కూటమి ప్రభుత్వం మాట తప్పిందన్నారు. ఆ హామీ నెరవేరి ఉంటే ఏడు వేల ఉద్యోగాలు ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకు దక్కేవన్నారు. హైడ్రో ప్రాజెక్టుల కోసం జారీ చేసిన జిఒలను రద్దు చేస్తున్నట్టు అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించాలని డిమాండ్ చేశారు. డోలీమోతలు లేని రాష్ట్రం వంటి మాటలు హామీలకే పరిమితమయ్యాయని శ్రీనివాసరావు దుయ్యబట్టారు. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ అదానీ, నవయుగ కంపెనీల కోసం చట్టాలను పాలకులు చుట్టాలుగా మార్చివేశారని విమర్శించారు. గ్రామసభ, పీసా కమిటీ, ప్రజల తీర్మానం లేకుండా బడా కార్పొరేట్ కంపెనీలకు హైడ్రో ప్రాజెక్టుల కోసం భూములు ధారాదత్తం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆదివాసీ గిరిజన సంఘం, సిపిఎం ఎర్రజెండా గిరిజనులకు అండగా ఉన్నాయన్నారు. ఎవ్వరూ భయపడవద్దని, పోరాటాన్ని ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ హైడ్రో పవర్ ప్రాజెక్టులు రద్దు చేయాలని గిరిజనులు ధర్నాలు, నిరసనలు చేసి, వినతి పత్రాలు అందించి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపించినా సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేదన్నారు.

అనంతగిరి జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, ఎంపిటిసి మజ్జి హరి మాట్లాడుతూ జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, ఎపిఎస్ ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర హైడ్రో పవర్ ప్రాజెక్టులపై ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. వారి వైఖరిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొర్రా త్రినాథ్, చిన్నయ్యపడాల్, వి.ఉమామహేశ్వరరావు, ఎస్‌బి.పోతురాజు, జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు, కిల్లో మొస్య, ఎస్.హైమవతి, ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మాన పడాల్, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న పాల్గొన్నారు.

ర్యాలీలో వి.శ్రీనివాసరావు, ఆదివాసీలు

పర్యాటకానికి చిరునామాగా విశాఖ

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ: అంతర్జాతీయ పర్యాట కానికి చిరునామాగా విశాఖను తీర్చిద్దేందుకు అవిరళ కృషి చేస్తున్నామని, ఇప్పటికే ఎన్నో రకాల అభివృద్ధి ప్రాజెక్టులను చేపట్టి అందుబాటులోకి తీసుకొచ్చామని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో శనివారం జరిగిన ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విశాఖను అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. డబుల్ డెక్కర్ బస్సు, యూహెచ్ 3హెచ్ మ్యూజియం, యాత్రీ నివాస్ పున్ణప్రారంభం తదితర నూతన ప్రాజెక్టులను ఇటీవల అందుబాటులోకి తీసుకొచ్చామని గుర్తు చేశారు. పర్యాటకులను విశేషంగా ఆకట్టుకునే విధంగా బీచ్ కారిడార్లో పలు రకాల వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఉత్తరాంధ్ర, దిగువ దక్షిణాంధ్ర ప్రాంతాలను కలుపుతూ టెంపుల్ టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ చెప్పారు. రెండు మూడు సంవత్సరాల్లో పర్యాటకంగా వినూత్న ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తాయని, విశాఖ రూపురేఖలు మరింత మారిపోతాయని పేర్కొన్నారు. రానున్న కాలంలో భీమిలి, విశాఖ ఉత్సవ్ ఉన్నాయని కలెక్టర్ చెప్పారు. వచ్చే ఫిబ్రవరిలో అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ, విశాఖ పరేడ్ జరుగుతాయన్నారు. ఇటీవల నిర్వహించిన వీడియో, ఫోటో గ్రఫీ పోటీల్లో విజేతలకు, వివిధ వేదికల కళాకారులను తదితరులను కలెక్టర్ సత్కరించారు. చిల్డ్రన్ ఎరీనా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. జిల్లా పర్యాటక శాఖ అధికారి జె. మాధవి, డీవీఎం జగదీశ్, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై చర్చిస్తున్న అధికారులు

సామరస్యంగా పరిష్కరించుకోవాలి

ప్రజాశక్తి-నర్సీపట్నం: రెవిన్యూ సమస్యల పరిష్కారానికి మండల లెవెల్ కో ఆర్డినేషన్ కమిటీ (ఎంఎల్‌సిసి) ఏర్పాటు చేసినట్లు తహసిల్దారు రామారావు తెలిపారు. మండల ప్రత్యేక అధికారిని జయంతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నర్సీపట్నం పరిధిలో శనివారం బొడ్డేపల్లి గ్రామానికి సంబంధించి రెండు, నర్సీపట్నంకు చెందిన రెవెన్యూ సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. రెవెన్యూ సమస్యలను ఇరువర్గాలు సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ శాఖ అధికారి రామకృష్ణ, ఎంపీడీవో సిబ్బంది పాల్గొన్నారు.

ఊరేగిస్తున్న పురోహితులు, భక్తులు

ఘనంగా వెంకన్న ఊరేగింపు

ప్రజాశక్తి-నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారిని ఆంజనేయ వాహనంలో ఊరేగించారు. శనివారం ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు, కృష్ణమాచార్యులు శేషాచార్యులు, గోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయం కిటకిటలాడింది.

బిఎన్ రోడ్డు పనుల్లో నిర్లక్ష్యంపై కోర్టు సీరియస్

నవంబర్ 15న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్ అండ్ బి చీఫ్ సెక్రటరీలు హాజరు కావాలని న్యాయమూర్తి నోటీసుల జారీ

మాట్లాడుతున్న న్యాయవాది డేవిడ్

ప్రజాశక్తి-చోడవరం : బిఎన్ రహదారి నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యంపై జిల్లా కోర్టు అధికారులపై సీరియస్ అయింది. దీనిపై ఎపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్ అండ్ బి శాఖ ప్రత్యేక సెక్రటరీలు నవంబరు 15న వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని జిల్లా 9వ అదనపు న్యాయమూర్తి హరినారాయణ నోటీసులు జారీ చేశారు. శనివారం బిఎన్ రహదారి మరమ్మతులు పనులు చేపట్టకపోవడంపై చోడవరం న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు చోడవరం జిల్లా కోర్టు సముదాయంలోని న్యాయ సేవాధికార సంస్థలో పిల్ దాఖలు చేసిన విషయం విదితమే. దీనిపై శనివారం జరిగిన కోర్టు వాయిదాకు ఆర్ అండ్ బి సూపరింటెండెంట్ ఇంజనీర్ జాన్ సుధాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.సాంబశివరావు హాజరయ్యారు. ఇప్పటివరకు చేపట్టిన పనులపై ఫొటోలు చూపగా సంతృప్తి చెందని న్యాయమూర్తి ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేశారు.

దీనిపై న్యాయవాది కాండ్రేగుల డేవిడ్ కోర్టు బయట విలేకరులతో మాట్లాడుతూ ఇక్కడ సమస్యలు పరిష్కారం కాకపోతే అవసరమైతే హైకోర్టును ఆశ్రయిస్తామని తెలిపారు. మూడు వాయిదాలు అయినప్పటికీ పనుల్లో ఎటువంటి మార్పు లేదన్నారు. రూ.144 కోట్లకుగాను ఇంతవరకు కేవలం రూ.28 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని పేర్కొన్నారు. వాయిదాలు తీసుకొంటున్నారు తప్ప కనీసం గుంతలు కూడా పూడ్చలేదన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు భరత భూషణ్, భూపతి రాజు పాల్గొన్నారు.

సకాలంలో సస్యరక్షణతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి-అనకాపల్లి : సకాలంలో సస్యరక్షణ చేపడితే అధిక దిగుబడులు వస్తాయని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పరిశోధన సహసంచాలకులు డాక్టర్ ముకుందరావు తెలిపారు. ఆర్ఏఆర్ఎస్‌లో శనివారం జరిగిన శిక్షణ సందర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్లో ఆగస్టులో కురిసిన వర్షాలతో 90 శాతం పంటలు వేసారన్నారు. ప్రస్తుతం వరి పంటలో పాము పొడ, ఆకు ముడత, సుడిదోమ వంటి చీడపీడలను గుర్తించడం జరిగిందని తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ ప్రతినిధి డాక్టర్ సిహెచ్ సుబ్రమణ్యం మాట్లాడుతూ యూరియా వినియోగాన్ని తగ్గించేందుకు రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ భవాని పాము పొడ తెగులు, సుడిదోమ నివారణకు తీసుకోవలసిన సస్యరక్షణ చర్యల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా వ్యవసాయ అధికారి అప్పలస్వామి, వ్యవసాయ శాస్త్రవేత్తలు శ్రీలత, రమణమూర్తి, మహేశ్వరరావు, సీతారామలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు
షష్టిపూర్తి శుభాకాంక్షలు
అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.
మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు
మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.
ఉద్యోగ విరమణ
షష్టిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు
మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి
సిటీ : 9490099125
మధురవాడ : 8008596645
గాజువాక : 9849392359
అనకాపల్లి : 8008736188
చోడవరం : 9490099141
నర్సీపట్నం : 9440280411
పాడేరు : 9490099142
రంపచోడవరం : 9440165617
పూర్ణమార్కెట్ : 9490099676
జగదాంబ : 9490099434
జివియంసి : 9490099483
ద్వారకానగర్ : 9490099672
కంచరపాలెం : 9490099135
మాదవధార : 9490099675